
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజనరీ నేత. పాలన బాగుందని ప్రజలు మెచ్చుకుంటున్నారు. పింఛన్ పెంపు, తల్లికివందనం నిధులు, రోడ్లు, ధాన్యం బకాయిలు తీర్చడం, ఉచిత బస్సు ప్రయాణం వంటివి సంక్షేమ పాలనకు నిదర్శనం.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శుక్రవారం 22.08.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 130 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


కొందరు ఎమ్మెల్యేల తీరుపై ..

## సీఎం సీరియస్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ క్యాబినెట్ భేటీ ముగిసిన అనంతరం తాజా రాజకీయ పరిణామాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు. కొందరు ఎమ్మెల్యేల వ్యవహారం తలనొప్పిగా మారిందంటూ సీరియస్ అయ్యారు. గాడితప్పుతున్న ఎమ్మెల్యేల విషయంలో ఇన్‌ఛార్జ్ మంత్రులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. దస్త్రాల క్లియరెన్స్‌కు మంత్రులు వేగం పెంచాలని సీఎం దిశానిర్దేశం చేశారు. దస్త్రాల క్లియరెన్స్‌లో ఒక్కోటి సగటున 3 రోజులు తీసుకుంటున్నానన్న సీఎం చంద్రబాబు తెలిపారు. తాను ఇప్పటి వరకు 3,366 దస్త్రాలను క్లియర్ చేసినట్లు పేర్కొన్నారు. పౌరసరఫరాల మంత్రికి సగటున ఒక్కో దస్త్రానికి 33 రోజులు పట్టిందని అనగా.. లెక్క సరిగా లేదని మంత్రి మనోహర్ చెప్పారు. ఒకసారి పరిశీలిద్దామని సీఎం వ్యాఖ్యానించారు.

**అంతకుముందు.. :** మంత్రివర్గ భేటీకి ముందు ఎమ్మెల్యేల వివాదాస్పద ఘటనలపై మంత్రులతో లోకేశ్ ప్రస్తావించారు. దగ్గుబాటి ప్రసాద్, కూన రవి, బుద్దా రాజశేఖర్, నజీర్ అహ్మద్ అంశాలు మిగతా 2లో...

# కేబినెట్ ...గ్రీన్ సిగ్నల్



### మొత్తం 33 అజెండా అంశాలకు మంత్రివర్గం ఆమోద ముద్ర

### అమరావతిలో మౌలిక వసతులకు రూ.904 కోట్లు కేటాయింపు

### కొత్త అసెంబ్లీ, హైకోర్టు భవనాల నిర్మాణానికి పరిపాలన అనుమతులు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి, ముఖ్యంగా రాజధాని అమరావతి నిర్మాణ పనులే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో మొత్తం 33 అజెండా అంశాలపై చర్చించి, వాటన్నిటికీ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అమరావతిలో మౌలిక వసతుల కల్పనకు భారీగా నిధులు కేటాయించారు. ఎస్సీ వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతి పరిధిలోని 29 గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.904 కోట్లు కేటాయిస్తూ సీఆర్‌డీఏ చేసిన ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో పాటు, అమరావతిలో కొత్తగా అసెంబ్లీ భవనాన్ని రూ.617 కోట్లతో, హైకోర్టు భవనాన్ని రూ.786 కోట్లతో నిర్మించేందుకు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఈ నిర్ణయాలతో రాజధాని నిర్మాణ పనులు మళ్లీ వేగం పుంజుకోనున్నాయని స్పష్టమవుతోంది.

వ్యవసాయ, సాగునీటి రంగాలకు కూడా ప్రభుత్వం పెద్దపీట వేసింది. ధాన్యం కొనుగోలు ప్రక్రియను సులభతరం చేసేందుకు మార్క్‌ఫెడ్ ద్వారా రూ.1000 కోట్ల రుణం సమీకరించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అదేవిధంగా, పోలవరం ఎడమ కాల్వ పనులకు రీటెండర్‌కు, పుంగనూరు బ్రాంచ్ కెనాల్ లైనింగ్ పనులకు కూడా ఆమోద ముద్ర వేసింది. మిగతా 2లో...

## సిహెచ్‌సీలకు రూ.52 కోట్లు



- పెరుగుతున్న ఓపీ, ఐపీ సేవలకనుగుణంగా అదనపు వసతుల కల్పన

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వాసుపత్రుల్లో పెరుగుతున్న అవసరాల మేరకు మౌలిక వసతుల కల్పనపై దృష్టిపెట్టిన కూటమి ప్రభుత్వం 9 సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో(సిహెచ్‌సిలు) అదనపు వసతుల కల్పనకు రూ.51.75 కోట్లు వ్యయం చేయనుంది. పెరుగుతున్న ఓపీ, ఐపీ సేవల డిమాండ్‌కు అనుగుణంగా వివిధ మౌలిక సదుపాయాల కల్పనకు ఈ 9 సిహెచ్‌సిల్లో రూ.51.75 కోట్లు వ్యయం చేయడానికి వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు.

ఆముదాలవలస, చోడవరం, కంకిపాడు, పొన్నూరు , కనిగిరి, ఉదయగిరి, చెన్నూరు(కడప జిల్లా), పత్తికొండ మరియు కళ్యాణదుర్గంలోని 9 సిహెచ్‌సీల్లో అదనపు వసతుల కల్పనకు మొత్తం రూ.51.75 కోట్ల వ్యయంతో వివిధ పనుల్ని చేపడతారు. ఆయా కేంద్రాల్లో ఓపీ, ఐపీ సేవలను పరిగణలోనికి తీసుకుని అవసరాల మేరకు చేపట్టనున్న వివిధ పనుల్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదించారు. ఈ 9 కేంద్రాల్లో గుర్తించిన అవసరాల మేరకు అదనపు వార్డులు, డయాగ్నోస్టిక్ బ్లాకులు, ఓపీ బ్లాకులు, ప్రసూతి గదులు, రక్త పరీక్ష కేంద్రాలు, ఆపరేషన్ థియేటర్లు, మార్చురీ సౌకర్యాలు కల్పిస్తారు. రాష్ట్రంలో ఉన్న 173 సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరాల మేరకు మౌలిక సదుపాయాల పెంపునకు వైద్యారోగ్య మంత్రిత్వ శాఖ తగు చర్యలు చేపడుతోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

## వాతావరణంలో.. అవేర్ సేవలు



- వాతావరణం, నీటినిర్వహణ సూచికల కోసం అవేర్ 2.0
- వర్షాలు, తుపాన్లపై 7 రోజుల ముందుగానే హెచ్చరికలు
- విపత్తు నిర్వహణలో కీలకంగా అవేర్ 2.0 వ్యవస్థ
- ప్రాణ, ఆస్తి నష్టాల నివారణలో ప్రధాన భూమిక
- నదులు, జలాశయాల్లో నీటి నిల్వలపైనా నిరంతర పర్యవేక్షణ
- వ్యవసాయం, మత్స్యకారులు సహా 42 రంగాల్లో అవేర్ సేవలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** వాతావరణ ముందస్తు అంచనాలు, విపత్తు నిర్వహణ, నదులు, జలాశయాల్లో నీటి నిల్వలపై పర్యవేక్షణ కోసం రాష్ట్రప్రభుత్వం ఆధునిక టెక్నాలజీని వినియోగిస్తోంది. అవేర్ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలోని వివిధ అంశాల్లో ముందస్తు సమాచారాన్ని ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వం మరిన్ని రంగాలను కూడా ఈ వ్యవస్థకిందకు తీసుకువస్తూ నిర్ణయం తీసుకుంది. వాతావరణంతో పాటు రాష్ట్రంలోని నదులు, జలాశయాల్లో నీటి నిల్వలు, సాయిల్ మాయిశ్చర్, గాలి నాణ్యత, కాలుష్యం, భూగర్భ జలాలు ఇలా వేర్వేరు అంశాలను పర్యవేక్షించేలా, ప్రజలకు వేగంగా సమాచారాన్ని అందించేలా అవేర్ 2.0ను రూపొందించింది. భారీ వర్షాలు, పిడుగులు, తుపాన్లు, తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలు లాంటి వాతావరణ అంశాలపై ముందస్తు సమాచారాన్ని సేకరించి అప్రమత్తం చేయటం ద్వారా ప్రజల ప్రాణాలను, ఆస్తిని కాపాడేలా వ్యవస్థ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. మిగతా 2లో...

## ఏపీ రెవెన్యూ శాఖకు రెండు స్కోచ్ అవార్డులు

### ఆన్‌లైన్ కోర్ట్ మేనేజ్మెంట్ సిస్టమ్, రీసర్వే 2.0కు స్కోచ్ అవార్డులు

### వచ్చే నెల 20 వ తారీఖున ఢిల్లీలో అవార్డుల ప్రధానోత్సవం

### రెవెన్యూ పాలనలో ఉత్తమ విధానాలకు నిదర్శనమన్న మంత్రి అనగాని సత్యప్రసాద్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ రెవెన్యూ శాఖ రెండు విభాగాల్లో 2025 ఏడాదికి గాను ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డులను కైవసం చేసుకుంది. ఆన్ లైన్ కోర్ట్ మేనేజ్మెంట్ సిస్టమ్, రీసర్వే 2.0కు అవార్డులు లభించాయి. వచ్చే నెల 20 వ తారీఖున ఢిల్లీలో జరిగే ప్రతిష్టాత్మక స్కోచ్ సమ్మిట్ లో అవార్డుల ప్రధానోత్సవం జరుగుతుంది.

ఏపీ రెవెన్యూ శాఖకు జాతీయ స్థాయిలో గౌరవం దక్కడం సంతోషాన్ని కలిగించిందని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన రెవెన్యూ శాఖను తిరిగి బలోపేతం చేసే దిశగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశంలో అమలు చేసిన వినూత్న సంస్కరణల ఫలితంగా ఈ 2 స్కోచ్ అవార్డులు దక్కాయి అనడంలో సందేహ లేదన్నారు.

**కేసుల పెండెన్సీని తగ్గించిన ఆన్‌లైన్ కోర్ట్ మేనేజ్మెంట్ సిస్టమ్ :** గత 14 నెలలుగా రెవిన్యూ శాఖలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. ఆన్‌లైన్ కోర్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ప్రారంభించి రెవెన్యూ కోర్టు వ్యవహారాలను డిజిటలైజ్ చేసి కేసుల పరిష్కారంలో పారదర్శకత, వేగం పెంచామన్నారు. రెవెన్యూ కోర్టుల్లో కేసుల పెండెన్సీని తగ్గించామన్నారు. పౌరులకు సలభమైన యాక్సిస్ కల్పించామన్నారు. ఈ సిస్టమ్ కారణంగా అధికారుల సమయ పాలనలో బాధ్యత పెరిగిందన్నారు. పౌరులు ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గిందన్నారు. రాష్ట్ర స్థాయి పాలసీ మానటరింగ్ కు విశ్లేషణాత్మక డేటా లభ్యమౌతుందన్నారు. మిగతా 2లో...

## పారదర్శకంగా డీఎస్సీ నియామకాలు

- అర్హులైన అభ్యర్థులను పారదర్శకంగా నియమించడమే ప్రభుత్వం దృఢ సంకల్పం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** మెగా డీఎస్సీ -2025 పరీక్షలు పూర్తిగా నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం, సాంకేతిక భద్రతతో, పారదర్శకంగా, పకడ్బందీగా విజయవంతంగా నిర్వహించడం జరిగింది. తర్వాత టెట్ మార్కులు సరిచేసుకోవడానికి అభ్యర్థులకు తగిన సమయం ఇవ్వడం జరిగింది. అభ్యర్థుల స్కోర్ కార్డులు విడుదల చేసిన తర్వాత కూడా ప్రతిభ కనబరిచిన ఏ అభ్యర్థి నష్టపోకూడదనే ఆలోచనతో టెట్ మార్కుల వివరాలు సవరించుకోవడానికి ఆఖరి అవకాశం కూడా ఇవ్వడమైంది. స్పోర్ట్స్ కోటా మెరిట్ జాబితా కూడా పూర్తి అయిన నేపథ్యంలో ఈ నెల 22వ తేదీన మెరిట్ లిస్ట్ విడుదల చేయడానికి తగిన ఏర్పాట్లు చేయడం జరుగుతోంది. మెరిట్ లిస్ట్ జాబితా డీఎస్సీ అధికారిక వెబ్సైటుతో పాటు జిల్లా విద్యాధికారి వెబ్సైటులో కూడా ఉంచడం జరుగుతుంది. అభ్యర్థులు ఈ వెబ్సైట్ల నుండి మాత్రమే సమాచారం పొందాలి. వివిధ కేటగిరీలకు సంబంధించిన పోస్టుల నియామక ప్రక్రియలో భాగంగా 'జోన్ ఆఫ్ కన్సిడరేషన్' లోకి వచ్చిన అభ్యర్థులకు తమ వ్యక్తిగత లాగిన్ ద్వారా కాల్ లెటర్ అందించబడుతుంది. సదరు అభ్యర్థులు సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఇటీవల తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం, గజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన మూడు సెట్లు జెరాక్స్ కాపీలు, 5 పాస్ పోర్టు సైజు ఫోటోలతో సర్టిఫికెట్లు వెరిఫికేషనుకు వ్యక్తిగతంగా హాజరు కావాల్సి ఉంటుంది. వెరిఫికేషనుకు హాజరు కావడానికి మునుపే సంబంధిత సర్టిఫికెట్లను వెబ్సైట్లో అప్ లోడ్ చేయడం తప్పనిసరి. వెరిఫికేషన్ సమయంలో సమర్పించవలసిన సర్టిఫికెట్ల వివరాలతో కూడిన చెక్ లిస్ట్ డీఎస్సీ వెబ్సైటులో అందుబాటులో ఉంచడం జరుగుతుంది. సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో అభ్యర్థి హాజరు కాకపోయినా, సరైన సర్టిఫికెట్లు సమర్పించకపోయినా, మిగతా 2లో...



## కెసిరెడ్డి ఆస్తుల జప్తు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డికి చెందిన మరిన్ని విలువైన ఆస్తులు, బ్యాంకు ఖాతాలను సీజ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఈ కేసులో కెసిరెడ్డి సహా పలువురు నిందితులు, పలు సంస్థలకు చెందిన రూ.62 కోట్ల విలువైన ఆస్తులు జప్తు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెండు జీవోల ద్వారా మిగతా 2లో...

## వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తా: విజయ్



**చెన్నై:** తనను ఎంతగా విమర్శిస్తే అంతగా ఎదుగుతానని టీవీకే పార్టీ అధ్యక్షుడు, తమిళ అగ్ర నటుడు విజయ్ పేర్కొన్నారు. తమ భావజాల శత్రువు బీజేపీ, రాజకీయ విరోధి డీఎంకే అని ఆయన స్పష్టం చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేకు, తమ పార్టీకి మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటి తలుపు తడతామని తెలిపారు. మదురైలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో విజయ్ ప్రసంగిస్తూ, అసెంబ్లీ ఎన్నికల్లో విప్లవం సృష్టిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను మధురై ఈస్ట్ నుంచి పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. కులం కాదు.. మతం కాదు తమిళుడికే ప్రాధాన్యం ఇస్తామని ఆయన ఉద్ఘాటించారు. బీజేపీతో చేతులు కలిపే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. మనుగడ కోసమే ఇతర పార్టీలు పొత్తులు పెట్టుకుంటున్నాయని విమర్శించారు. మనం ఆరెస్సెస్ ముందు మిగతా 2లో...

## దంత సంరక్షణ కీలకం




**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్):** క్రీడాకారులకు ప్రభుత్వ పరంగా క్రీడా సౌకర్యాలతో పాటు ఆరోగ్య సంరక్షణపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని రాష్ట్ర రవాణా, యువజన మరియు క్రీడా శాఖ ల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. గురువారం ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం శాప్ కార్యాలయం ఇండియన్ అకాడమీ ఆఫ్ స్పోర్ట్స్ డెంటిస్ట్రీ ఆధ్వర్యంలో మిగతా 2లో...

## కొందరు ఎమ్మెల్యేల తీరుపై .. సీఎం సీరియస్

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తావించినట్లు సమాచారం. శ్రీకాంత్‌కు పెరోల్ సిఫార్సు చేసిన కోటంరెడ్డి, సునీల్ అంశాలపై ప్రస్తావించారు. అనంతపురం, శ్రీశైలం ఎమ్మెల్యేలు సహా ఏడుగురి తీరు సరికాదని లోకేశ్ పేర్కొన్నారు. సీఎం కూడా ఆగ్రహంతో ఉన్నారని మంత్రులతో వ్యాఖ్యానించారు. ప్రభుత్వానికి నష్టం వచ్చేలా ఉంటే ఉపేక్షించేది లేదన్న స్పష్టం చేశారు. పెరోల్ విషయాల్లో ఎమ్మెల్యేలు సిఫార్సు చేస్తే ఆచితూచి వ్యవహరించాలని అనితకు సూచించారు. దివ్యాంగుల పింఛన్ల తొలగింపుపై ఫిర్యాదులను లోకేశ్ దృష్టికి మంత్రులు తీసుకెళ్లారు. అర్హులు నష్టపోకుండా పింఛన్లు ఇచ్చేలా చర్యలు తీసుకుందామని లోకేశ్ తెలిపారు.

## ఏపీ రెవెన్యూ శాఖకు రెండు స్కోచ్ అవార్డులు

(మొదటి పేజీ తరువాయి)

**తప్పులకు అస్కారం లేకుండా పకడ్బందీగా రీ సర్వే 2.0**

ముఖ్యంగా గత వైకాపా హయాంలో తప్పులతడకగా జరిగిన రీసర్వే 1.0 ద్వారా తలెత్తిన భూవివాదాలతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. రీ సర్వే జరిగిన గ్రామల్లో గ్రామసభలు నిర్వహించగా 2 లక్షల 80 వేల అర్జీలు వచ్చాయన్నారు. వాటన్నింటినీ పరిష్కరించామన్నరు. రీ సర్వే 2.0లో ఎటువంటి తప్పిదాలకు అస్కారం లేకుండా పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. ఈసారి ప్రతి మండలానికి ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకొని గత ప్రభుత్వంలో జరిగిన తప్పులకు ఆస్కారం లేకుండా పక్కా ప్రణాళికా యుతంగా రీ సర్వేను చేస్తున్నామన్నారు. ప్రతి గ్రామాన్ని బ్లాకులుగా విభజించి ఒక్కో బ్లాక్‌లో 200 నుండి 250 ఎకరాల వరకు రీ సర్వే చేస్తున్నామన్నారు. ఒక్కో బ్లాక్ కు ఇద్దరు సర్వేయర్లు, ఒక విఆర్వో, ఒక విఆర్ ఏను ఇచ్చామని, ఆ బ్లాక్ లో ఉన్న రైతులందరితో కలిపి ఒక వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేశామని చెప్పారు. రోజుకు 20 ఎకరాలు మాత్రమే సర్వే చేస్తున్నామని, సర్వే చేసే ముందు అందరికీ నోటీసులు ఇచ్చి వారికి ముందుగానే సమాచారం ఇస్తున్నామని తెలిపారు. రీ సర్వే 2.0ను 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని చెప్పారు.

రెవెన్యూ పరిపాలనను ప్రజలకు చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఉత్తమ విధానాలకు స్కోచ్ అవార్డులు నిదర్శనమన్నారు. రెవిన్యూ శాఖ అధికారులు, సిబ్బంది చేసిన కృషి ఫలితమే ఈ అవార్డులు అని సగర్వంగా తెలియజేస్తున్నానన్నారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్, సీసీఎల్ఎ జయలక్ష్మీ, సర్వే శాఖ డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## పారదర్శకంగా డీఎస్సీ నియామకాలు

(మొదటి పేజీ తరువాయి)

తగిన విద్యార్హతలు లేనట్లుగా రుజువైనా మెరిట్ లిస్టులో తరువాత ఉన్న అభ్యర్థికి అవకాశం ఇవ్వడం జరుగుతుంది.

ఉపాధ్యాయ ఉద్యోగం ఇప్పిస్తామని దళారులు చెప్పే మాటలు, కొంతమంది సోషల్ మీడియా వేదికగా, అసత్య వదంతులు వ్యాప్తి చేస్తూ అభ్యర్థులను ఆందోళనకు గురిచేస్తూ, అభ్యర్థుల మనోభావాలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారు. ఇలాంటి దుష్ప్రచారాలను నమ్మి అభ్యర్థులు మోసపోవద్దని, ఇలాంటి వదంతులు సృష్టించి వ్యాప్తి చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడమైంది. కాబట్టి అభ్యర్థులు కేవలం డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో ఉన్న ప్రకటనలు, నోటిఫికేషన్లు, ఫలితాలను మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని తెలియజేయడమైనది. అభ్యర్థుల వ్యక్తిగత స్కోర్లు, మెరిట్ లిస్ట్, ఎంపిక జాబితాలు, నియామక ఉత్తర్వులు మెగా డీఎస్సీ అధికారిక వెబ్సైటు, జిల్లా విద్యాధికారి వెబ్సైట్ , క్యాండిడేట్ లాగిన్ నందు మరియు ప్రభుత్వం ద్వారా విడుదల చేయబడే పత్రికా ప్రకటనల ద్వారా మాత్రమే తెలియజేయబడతాయి.

రాష్ట్రంలో నాణ్యమైన విద్యను అందించేందుకు అర్హులైన అభ్యర్థులను పారదర్శకంగా నియమించాలని ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉంది.

## కెసిరెడ్డి ఆస్తుల జప్తు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే అనుమతులు ఇచ్చింది. తాజాగా.. మరో రూ.13 కోట్లకు పైగా విలువ చేసే ఆస్తులు, బ్యాంకు ఖాతాలను జప్తు చేసేందుకు సీఐడీకి అనుమతులు జారీ చేసింది.

వైకాపా హయాంలో అక్రమ మద్యం అమ్మకాలతో వచ్చిన ముడుపుల ద్వారా పలు చోట్ల తన కుటుంబ సభ్యులు, బంధువుల పేరిట రూ.కోట్ల విలువ చేసే ఆస్తులు కొనుగోలు చేసినట్టు సీఐడీ విచారణలో తేలింది. వీటిని సీజ్ చేసేందుకు అనుమతించాలని సీఐడీ రాష్ట్రప్రభుత్వాన్ని కోరడంతో అనుమతి మంజూరు చేసింది. అక్రమ మద్యం వ్యాపారం నుంచి సంపాదించిన మొత్తం రాజ్ కెసిరెడ్డి పేరిట తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దామెరపల్లె, మాచన్‌పల్లి గ్రామాల పరిధిలోని పలు సర్వేనెంబర్లలో రూ.కోట్ల విలువ చేసే 27.06 ఎకరాల భూమి కొనుగోలు చేసినట్లు డాక్యుమెంట్లతో సహా సీఐడీ ఆధారాలు సేకరించింది. వివిధ ప్రాంతాల్లో కూడబెట్టిన ఆస్తుల విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారం రూ. 13 కోట్లు కాగా.. మార్కెట్ విలువ ప్రకారం రూ.వంద కోట్ల పైనే ఉంటుందని సీఐడీ వర్గాలు చెబుతున్నాయి. ఆస్తుల సీజ్‌కు ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో కెసిరెడ్డి రాజశేఖరెడ్డి ఆస్తులు అటాచ్‌మెంట్ చేయాలని కోరుతూ విజయవాడలోని స్పెషల్ ఏసీబీ కేసుల విచారణ ప్రత్యేక న్యాయమూర్తి ముందు సిట్ అధికారులు పిటిషన్ వేయనున్నారు. కోర్టు తగిన విచారణ జరిపిన అనంతరం ఆస్తుల అటాచ్ మెంట్‌కు ఆదేశాలు జారీ చేసే అవకాశాలున్నాయి.

## జీఎస్టీలో 2 శ్లాబుల ప్రతిపాదనకు మంత్రుల బృందం ఓకే

**దిల్లీ:** వస్తు సేవల పన్ను (జీఎస్టీ) సంస్కరణల విషయంలో కీలక ముందడుగు పడింది. పరోక్ష పన్నుల విధానంలో రెండు శ్లాబులు ఉంచాలన్న కేంద్రం ప్రతిపాదనలకు మంత్రుల బృందం ఆమోదం తెలిపింది. 12, 28 శాతం శ్లాబులు తొలగించి.. 5, 18 శాతం శ్లాబులు మాత్రమే ఉంచేందుకు మంత్రుల బృందం అంగీకారం తెలిపినట్లు బిహార్ ఉప ముఖ్యమంత్రి, రేటు హేతుబద్ధీకరణకు సంబంధించి జీవోఎం కన్వీనర్ సామ్రాట్ చౌధరి తెలిపారు.

రేటు హేతుబద్ధీకరణకు సంబంధించి కేంద్రం చేసిన రెండు ప్రతిపాదనలకూ జీవోఎం ఆమోదం తెలిపినట్లు సామ్రాట్ చౌధరి మీడియాకు వెల్లడించారు. కేంద్ర ప్రతిపాదనలో అల్ట్రా లగ్జరీ, సిన్ గూడ్స్ (సిగరెట్లు వంటివి)పై 40 శాతం పన్ను విధించడం కూడా ఉందని యూపీ ఆర్థికమంత్రి సురేష్ కుమార్ ఖన్నా తెలిపారు. కార్లు, సిన్‌గూడ్స్ వంటి అల్ట్రా లగ్జరీ వస్తువులపై ప్రస్తుత పన్ను రేటు కొనసాగించేందుకు తమ రాష్ట్రం 40 శాతం జీఎస్టీ రేటుపై లెవీని ప్రతిపాదించిందని పశ్చిమబెంగాల్ ఆర్థిక మంత్రి చంద్రిమా భట్టాచార్య తెలిపారు. ఈ కొత్త జీఎస్టీ శ్లాబ్‌ల అమలు తర్వాత కేంద్రం, రాష్ట్రాలకు కలిగే ఆదాయ నష్టం గురించి కేంద్రం చేసిన ప్రతిపాదల్లో ప్రస్తావించలేదని ఆమె పేర్కొన్నారు. రేట్ల హేతుబద్ధీకరణకు సంబంధించి సామ్రాట్ చౌధరి నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల మంత్రుల బృందం గురువారం భేటీ అయ్యింది. ప్రస్తుతం నాలుగు శ్లాబుల స్థానే (5, 12, 18, 28 శాతం) రెండు శ్లాబులు మాత్రమే (5, 18) ఉంచేందుకు మంత్రుల బృందం అంగీకరించింది. దీంతో పాటు హానికర ఉత్పత్తులకు 40 శాతం జీఎస్టీ విధించేందుకు ఆమోదం తెలిపింది. జీఎస్టీ కౌన్సిల్‌లో తుది నిర్ణయం తీసుకోనున్నారు.

# కేబినెట్ ..గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

సామాజిక న్యాయం దిశగా మరో కీలక అడుగు వేస్తూ, ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన ముసాయిదా ఆర్డినెన్స్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది. పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా 'ఏపీ సర్క్యులర్ ఎకానమీ, వేస్ట్ రీసైక్లింగ్ పాలసీ 4.0'ను కూడా మంత్రివర్గం ఆమోదించింది. అనంతపురం జిల్లాను సౌర, పవన విద్యుత్ కేంద్రంగా తీర్చిదిద్దే ప్రాజెక్టులకు, రాష్ట్రంలో పర్యాటక ప్రాజెక్టుల కోసం భూముల కేటాయింపునకు కూడా కేబినెట్ పచ్చజెండా ఊపింది. రాష్ట్ర అధికార భాషా సంఘం పేరును మార్చే ప్రతిపాదనను కూడా మంత్రివర్గం అంగీకరించింది.

సమావేశం అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ, ఈ నిర్ణయాలు రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. మంత్రులంతా ప్రజలతో మమేకమై, దూకుడుగా పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారని ఆయన వివరించారు.

**30కి పైగా అంశాలకు ఆమోదం:** మంత్రివర్గ సమావేశంలో 30కిపైగా అజెండా అంశాలకు ఆమోదం దక్కింది. వచ్చే వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టే 3 ముసాయిదా బిల్లులకు ఆమోదం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సర్క్యులర్ ఎకానమీ, వేస్ట్ రీసైక్లింగ్ పాలసీ-4.0పై చర్చించారు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు సంబంధించిన నాలా చట్ట సవరణలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నాలా పన్ను 4 శాతంలో



స్థానిక సంస్థలకు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు ఎంత ఇవ్వాలి అనే అంశాన్ని మంత్రి మనోహర్ ప్రస్తావనకు తెచ్చారు. 70 శాతం స్థానిక సంస్థలకు, 30 శాతం అథారిటీలకు ఇవ్వాలన్న ఆదేశాలు ఉన్నాయని గుర్తుచేశారు. పంచాయతీరాజ్ చట్టంలోని పలు సెక్షన్ల చట్ట సవరణకు మంత్రివర్గ ఆమోదం లభించింది.

51వ సీఆర్‌డీఏ అథారిటీ సమావేశం ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. అమరావతి పరిధిలోని 29 గ్రామాల్లో 904 కోట్లతో మౌలిక వసతుల కల్పనకు పచ్చజెండా ఊపారు. సీఆర్?డీఏ పరిధిలో వివిధ సంస్థలకు భూకేటాయింపుల సమీక్షకు, మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వివిధ ప్యాకేజీల పనులకు సంబంధించి ఎల్?-1 బిడ్డర్లుగా ఉన్నవారికి సీఆర్?డీఏ పరిధిలో పనులు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. పర్యాటక ప్రాజెక్టులకు ప్రభుత్వ భూముల కేటాయింపు కోసం రూపొందించిన మార్గదర్శకాలపై చర్చించారు.

కాకినాడ జిల్లా గండేపల్లి మండలం తాళ్లూరులో తోట వెంకటాచలం పుష్కర లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ప్రధాన కాలువ అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. చింతూరులోని 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లా 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేయడంతోపాటు 56 కొత్త పోస్టుల మంజూరు ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాకారుడు సాకేత్ ఎస్? మైనేనికి స్పోర్ట్స్ కోటా కింద డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగం కల్పిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు శ్రీకాకుళంలో వివిధ క్రిమినల్ కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటుకు ఆమోదం దక్కింది.ష

2778 పోస్టుల భర్తీకి ఆమోదం: అధికారిక భాషా కమిషన్ పేరును 'మండలి వెంకటకృష్ణారావు అధికారిక భాషా కమిషన్'గా మార్చేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ స్థాయిని సంక్షేమ అభివృద్ధి కార్యదర్శిగా మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు. గ్రామ, వార్డు సచివాలయాలకు సంబంధించి ఏపీజీఎస్‌డబ్లయూఎస్ చట్టం-2023కు అవసరమైన సవరణలపై కేబినెట్ సమావేశంలో చర్చించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో డిప్యుటేషన్, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన 2778 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపారు. 1785 గ్రామ, వార్డు సెక్రటేరియట్ ఫంక్షనరీలను సముచితంగా మార్చేందుకు 993 కొత్త పోస్టుల మంజూరుకు నిర్ణయం తీసుకున్నారు.

మద్యం ప్రాథమిక ధరలు, విదేశీ మద్యం బ్రాండ్లకు టెండర్ కమిటీ సిఫార్సులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ యాచక నిరోధక చట్ట సవరణ ముసాయిదా బిల్లుపై కేబినెట్ భేటీలో చర్చించారు. మా లక్ష్మి ఇన్‌ఫ్రా వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి 100 శాతం ఓనర్‌షిప్‌ను అభిషియా హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఇచ్చే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. గుంటూరులోని టీడీపీ కార్యాలయానికి ఉన్న 2954 చదరపు గజాల మున్సిపల్ భూమి లీజు కాలపరిమితిని 33 సంవత్సరాల నుంచి 99 ఏళ్లకు పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

# లాజిస్టిక్స్ హబ్‌గా ఏపీ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ ను సముద్ర వాణిజ్యంలో తూర్పుతీర గేట్ వే గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు వాస్తవ రూపం దాలుస్తున్నాయి. అంతర్జాతీయ షిప్పింగ్ లాజిస్టిక్స్, పోర్టుల నిర్వహణ లో అగ్రశ్రేణి కంపెనీ ఏపీ మోలర్ మేర్స్క్ అనుబంధ సంస్థ ఏపీఎం టెర్మినల్స్ రాష్ట్రంలోని పోర్టుల అభివృద్ధికి ఏపీ మారి టైమ్ బోర్డుతో అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. రూ. 9 వేల కోట్ల పెట్టుబడితో రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టుల అభివృద్ధితో పాటు మౌలిక సదుపాయాలను ఏపీఎం టెర్మినల్స్ కల్పించనుంది. ఈమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో ఏపీ మారిటైమ్ బోర్డు- ఏపీఎం టెర్మినల్స్ సంస్థలు ఒప్పందాన్ని చేసుకున్నాయి. ఈ పోర్టుల్లో ఆధునిక టెర్మినల్స్, కార్గో హ్యాండ్లింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసి నిర్వహణను చేపట్టనుంది. తద్వారా ప్రత్యక్షంగా 10 వేల మందికి ఉద్యోగ అవకాశాలు దక్కే అవకాశం ఉంది. మరోవైపు దేశీయంగా ఉన్న మార్కెట్ లో సరకు రవాణాకూ ఏపీఎం టెర్మినల్స్ సంస్థ సేవలు ఉపకరించాలని సీఎం స్పష్టం చేశారు. పోర్టులకు అనుబంధంగా ఆర్థిక ఎకో సిస్టంను రూపొందించాలని సీఎం సూచించారు. పోర్టులు, లాజిస్టిక్స్ తో ఏపీని ఫ్యూచర్ ఎకానమీగా



తయారు చేయాలన్నదే తమ లక్ష్యమని సీఎం అన్నారు.

**లాజిస్టిక్స్ హబ్ ఆఫ్ ఇండియాగా ఏపీ :** ఆంధ్రప్రదేశ్ ను దేశంలో లాజిస్టిక్స్ హబ్ గా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికను రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రైలు, రోడ్డు, అంతర్గత జలమార్గాలు, వాయు మార్గాల ద్వారా రవాణా అయ్యే కార్గోకు సంబంధించి సమగ్ర ప్రణాళిక రూపకల్పనలో సహకారం అందించాలని ఏపీఎం టెర్మినల్స్ సంస్థను సీఎం కోరారు. తెలంగాణా, చత్తీస్ ఘడ్ రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్నాటక, ఒడిశాలోని కొన్ని ప్రాంతాలు ఏపీలోని పోర్టులపైనే ఆధారపడుతున్నాయని.. ఈ రాష్ట్రాల నుంచి వచ్చే సరకు అతి తక్కువ వ్యయంతో రవాణా అయ్యేలా ఈ ప్రణాళిక ఉండాలని సీఎం సూచించారు. ఏపీలో 1053 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతంలో ప్రతీ 50 కిలోమీటర్లకు ఒక పోర్టు, లేదా హార్బర్ నిర్మాణం చేపట్టేలా కార్యాచరణ చేపట్టామని సీఎం స్పష్టం చేశారు. మరోవైపు ఏపీఎం టెర్మినల్స్ - ఏపీ మారిటైమ్ బోర్డు మధ్య అవగాహనా ఒప్పందం కార్యక్రమానికి మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ సహా ఇతర ఉన్నతాధికారులు, ఏపీఎం టెర్మినల్స్ సంస్థ ప్రతినిధులు హాజరయ్యారు.

# వాతావరణంలో.. అవేర్ సేవలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు ఏపీ వెదర్ ఫోర్ కాస్టింగ్ అండ్ ఎర్లీ వార్నింగ్ రీసెర్చ్ సెంటర్-అవేర్ 2.0 వ్యవస్థను ఆర్టీజీఎస్ ఏర్పాటు చేసింది. ఈ వ్యవస్థ ద్వారా వర్షాలు, వరదలు, పిడుగులు, గాలివానలు, జలాశయాల నీటి స్థాయిలు, నదుల ప్రవాహాలపై ముందస్తు అంచనాలు ఇచ్చి విపత్తు నిర్వహణలో కీలక సమాచారాన్ని ముందుగానే అందుబాటులోకి రానుంది. వాతావరణంలో వచ్చే మార్పులను 7 రోజుల ముందుగానే అవేర్-2.0 వ్యవస్థ పసిగట్టి హెచ్చరికలు జారీ చేయనుంది. ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమై ప్రజల ప్రాణాల్ని, ఆస్తుల్ని, మూగజీవాలను కాపాడేందుకు ఆస్కారం ఏర్పడింది. ఆవేర్ 2.0 తో ప్రకృతి విపత్తుల వల్ల కలిగే ప్రాణ, ఆస్తి నష్టాలను చాలా వరకు తగ్గించే అవకాశం కలుగుతుందని ఆర్టీజీఎస్ చెబుతోంది. కొత్త వ్యవస్థతో పూర్తిగా మరణాలను నివారించేందుకు ఆస్కారం ఏర్పడిందని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

**రైతులకు, మత్స్యకారులకు మేలు జరిగేలా :**

అవేర్ 2.0 ద్వారా వారం రోజుల ముందుగానే వర్షపాతం, గాలి వేగం, మెరుపులు, పిడుగుపాటుపై ఖచ్చితమైన అంచనాలు లభిస్తున్నాయని ఆర్టీజీఎస్ వెల్లడించింది. ఈ సమాచారం ఆధారంగా రైతులు పంటల నిర్వహణ, మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లకుండా ముందస్తుగా హెచ్చరికలు జారీ చేయొచ్చని అధికారులు చెబుతున్నారు. తుపాన్లకు సంబంధించి ముందస్తు సమాచారం లేకపోవటంతో మత్స్యకారులు సముద్రంలో చిక్కుకుంటున్న పరిస్థితులు నెలకొంటున్నాయని ఈ కారణంగా వారి విలువైన ప్రాణాలు కోల్పోవటం లేదా పొరుగుదేశాల సరిహద్దుల్లోకి వెళ్తున్న ఘటనలు నమోదు అవుతున్నట్టు ఆర్టీజీఎస్ తెలిపింది. ప్రస్తుతం అవేర్ -2.0 వ్యవస్థతో సముద్రంలో జరిగే ప్రమాదాలను నివారించవచ్చని స్పష్టం చేసింది. మరోవైపు రాష్ట్రంలోని 109 జలాశయాలు, కృష్ణా-గోదావరి వంటి ప్రధాన నదులపై రియల్ టైమ్ మానిటరింగ్ ను కూడా చేస్తున్నట్టు ఆర్టీజీఎస్ తెలిపింది. రిజర్వాయర్లలో నీటి నిల్వలు, ప్రవాహాలపై కూడా అవేర్ తో తక్షణం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

**ముందస్తు చర్యలతో ప్రజల రక్షణ :** ప్రకాశం బ్యారేజ్, పోలవరం, శ్రీశైలం వంటి కీలక ప్రాజెక్టులు, నదీ పరివాహక ప్రాంతాల్లో వరద ప్రవాహాల అంచనాలను ముందస్తుగానే తెలుసుకుని ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఆవేర్ ఆస్కారం కల్పించనుంది. ఈ వ్యవస్థ ద్వారా వ్యవసాయం, మత్స్యకారులు, రవాణా, విద్యుత్, జలవనరులు వంటి 42 విభాగాలకు సేవలు అందనున్నాయి. అలాగే వ్యవసాయానికి సంబంధించి భూగర్భజలాల లభ్యతతో పాటు మండల, జిల్లాల వారీగా పంటలకు వచ్చే తెగుళ్ల లాంటి అంశాల్లోనూ హెచ్చరికలు జారీ చేసేందుకు అవేర్ వ్యవస్థ ఉపయోగపడనుంది. మరోవైపు సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులకు కూడా ఏ ప్రాంతాల్లో చేపలు ఎక్కువగా లభ్యం అవుతాయన్న అంశాన్ని కూడా ఉపగ్రహ ఛాయాచిత్రాల ఆధారంగా అవేర్ అందిస్తుందని ఆర్టీజీఎస్ స్పష్టం చేసింది. ఈ సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచేలా రాష్ట్ర ప్రభుత్వం ఓ డ్యాష్ బోర్డును ఏర్పాటు చేసింది. aware.ap.gov.in వెబ్ సైట్ లో వాతావరణ సూచనలు, జలాశయాల స్థితి, నదుల ప్రవాహాలపై లైవ్ డేటా చూసేందుకు ఆస్కారం ఏర్పడనుందని ఆర్టీజీఎస్ స్పష్టం చేసింది.


# వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తా: విజయ్

(మొదటి పేజీ తరువాయి)

ఎందుకు తలవంచాలని ఆయన ప్రశ్నించారు. తమిళ అస్తిత్వాన్ని ప్రతిపక్షాలు తగ్గిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కచ్చతీవులకు శ్రీలంక నుంచి స్వేచ్ఛ కల్పిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఢిల్లీలో రహస్య సమావేశాలు జరుపుతున్నారని ఆరోపించారు. ఆయన పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. 2024 ఫిబ్రవరిలో టీవీకేను స్థాపించినప్పటి నుంచి భారీ సభను నిర్వహించడం ఇది రెండోసారి. గత ఏడాది విల్లుపురం జిల్లాలోని విక్రవందిలో మొదటి సభను నిర్వహించారు.

**విజయ్ టీవీకే సభలో తొక్కిసలాట..:** కోలీవుడ్ అగ్రనటుడు, టీవీకే పార్టీ అధినేత విజయ్ నిర్వహించిన బారీ బహిరంగ సభలో తొక్కిసలాట



జరిగింది. మధురైలో గురువారం సాయంత్రం జరుగుతున్న ఈ సభకు సుమారు నాలుగు లక్షల మంది హాజరుకాగా.. తొక్కిసలాటతో 400మంది అస్వస్థతకు గురయ్యారు. ఇందులో ఒకరు మరణించారు. పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది జరగనున్నాయి. ఈ నేపథ్యంలో తమిళగ వెట్రి కగళం(టీవీకే) గురువారం మధురైలో నాలుగు లక్షలమందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తోంది. మధురై జిల్లాలోని మధురై-తూత్తుకుడి హైవేలో పరపతిలో టీవీకే రెండవ రాష్ట్ర బహిరంగ సభ జరుగుతోంది. 501 ఎకరాల్లో సచివాలయం ఆకారంలో ఈ సభను ఏర్పాటు చేసింది.

ఈ భారీ బహిరంగ సభకు హాజరైన అశేష జనసంద్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తాము ఏ పార్టీతో పొత్తు పెట్టుకోవడం లేదని ఇళయదళపతి హీరో విజయ్ ప్రకటించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ ఒంటరిగానే బరిలో దిగుతుందని స్పష్టం చేశారు. బీజేపీ, డీఎంకేలతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. టీవీకే పార్టీ సిద్ధాంతానికి ఈ రెండు పార్టీలు శత్రువులని పేర్కొంది.

## దంత సంరక్షణ కీలకం



(మొదటి పేజీ తరువాయి)

క్రీడా దంత సురక్ష - ఛాంపియన్స్ విన్నింగ్ స్మైల్స్ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ దంత సంరక్షణ ను కాపాడుకోవల్సిన ఆవశ్యకత ముఖ్యంగా క్రీడాకారులపై ఉందని, అందుకే ప్రభుత్వ పరంగా ఇలాంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. క్రీడాకారుల సమగ్ర ఆరోగ్యానికి దంత సంరక్షణ కూడా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ముఖ్యంగా క్రీడాకారులకు దంత సంరక్షణ లో మెలుకువలు పాటించాల్సి ఉందన్నారు. రెగ్యులర్ గా డెంటల్ చెకప్‌లు చేయించుకుంటే డెంటల్ సమస్యలను నివారించవచ్చన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా యువ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో మరింత మెరుగైన ప్రతిభను కనబరచే వీలుందని మంత్రి తెలిపారు.

డా. శ్రీవల్లి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక వర్క్‌షాప్‌లో క్రీడాకారులకు క్రీడల్లో నోటి ఆరోగ్య ప్రాముఖ్యత, విరిగిన పళ్ల అత్యవసర నిర్వహణ, క్రీడలకు ప్రత్యేకంగా ఉండే మౌత్‌గార్డ్స్ వినియోగంపై అవగాహన కల్పించారు. అదనంగా, క్రీడాకారులకు ఓరల్ హెల్త్ స్క్రీనింగ్ నిర్వహించగా, రాబోయే నెలల్లో బేసిక్ లైఫ్ సపోర్ట్ సర్టిఫికేషన్ శిక్షణ కూడా ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు.

కార్యక్రమంలో శాప్ చైర్మన్ రవి నాయుడు, శాప్ వీసీ మరియు ఎండీ గిరీషా, ఇండియన్ డెంటల్ అసోషియేషన్ కోస్టల్ ఆంధ్రా బ్రాంచ్ అధ్యక్షులు డాక్టర్ శిల్పా రావు, సెక్రటరీ డాక్టర్ అజయ్ బెనర్జీ, డాక్టర్ అతుల్ సుర్వే, క్రీడాకారులు, కోచ్ లు తదితరులు పాల్గొన్నారు.

## భారత్‌పై అమెరికా సుంకాలు.. పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం: చైనా



**చైనా :** భారత్‌పై అమెరికా సుంకాల విధింపు, వాటిని మరింత పెంచుతామని ఆ దేశం చేస్తున్న ప్రకటనలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు చైనా పేర్కొంది. వాణిజ్య, సుంకాల యుద్ధాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నాయని ఆరోపించింది. దిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో భారత్‌లోని చైనా రాయబారి జు ఫీహాంగ్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. భారత్- చైనా సంబంధాలు మళ్లీ పట్టాలెక్కుతున్న తరుణంలో.. ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. "స్వేచ్ఛా వాణిజ్యం వల్ల ఎంతో ప్రయోజనం పొందిన అమెరికా ఇప్పుడు ఆయా దేశాలపై సుంకాలను ప్రయోగిస్తోంది. భారత్‌పై 50 శాతం మేర సుంకాలు విధించింది. వాటిని మరింత పెంచుతామని హెచ్చరిస్తోంది. అయితే.. వీటిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం. ఈ వ్యవహారంలో భారత్ వెన్నంటి నిలుస్తాం. ఇటువంటి సందర్భాల్లో మౌనంగా ఉండటం, రాజీ పడటం.. బెదిరింపులకు పాల్పడేవారికి మరింత ధైర్యాన్నిస్తుంది. చైనా లోని తియాంజిన్ వేదికగా 'షాంఘై సహకార సంస్థ' శిఖరాగ్ర సదస్సు నేపథ్యంలో భారత్ సహా అన్నిపక్షాలతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాం. భారత్, చైనాలు కలిసి తమ సంబంధాల్లో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టగలవు" అని ఫీహాంగ్ పేర్కొన్నారు. "అంతర్జాతీయ వేదికపై పెను మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే అభివృద్ధి చెందుతున్న దేశాలుగా భారత్, చైనాలు ఐక్యంగా ఉంటూ.. పరస్పరం సహకరించుకోవాలి. ఇరుదేశాల స్నేహం.. ఆసియాకు, ప్రపంచానికీ మేలు చేకూరుస్తుంది. ప్రాంతీయ ఆర్థిక వృద్ధికి మన రెండు దేశాలు డబుల్ ఇంజిన్ల లాంటివి" అని ఫీహాంగ్ వ్యాఖ్యానించారు. భారత్, చైనా మధ్య సంబంధాలు స్థిరమైన పురోగతిని సాధించాయని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే.

# ఢిల్లీ సిఎంపై దాడి ఎందుకు చేశాడు?

## నిందితుని అరెస్టుచేసి దర్యాప్తు జరుపుతున్న పోలీసులు



**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తాపై ఓ వ్యక్తి దాడి చేయడం సంచనలం రేపిన విషయం తెలిసిందే. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు అతడిని గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన రాజేశ్ భాయ్ ఖిమ్జీ భాయ్ సకారియా (41)గా గుర్తించారు. గుజరాత్‌లోనూ అతడిపై దర్యాప్తు ముమ్మరం చేసిన అధికారులు దాడికి గల కారణాలు తెలుసుకొనే పనిలో పడ్డారు. ఈ సందర్భంగా అతడి కుటుంబ సభ్యులను విచారిస్తున్నారు. ముఖ్యమంత్రిపై సకారియా ఎందుకు దాడి చేశాడనే విషయంపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. నిందితుడి బంధువు జైల్లో ఉన్నాడని, అతడిని విడుదల చేయాలని సిఎంకు విజ్ఞప్తి చేసేందుకు ముఖ్యమంత్రి అధికార నివాసానికి వచ్చినట్లు వార్తలు వచ్చాయి. ఇందుకు సంబంధించిన వ్యవహారం ప్రస్తుతం కోర్టులో పెండింగులో ఉందని జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. అయితే వీటిని పోలీసులు దృవీకరించాల్సి ఉంది. మరోవైపు గుజరాత్‌లో నిందితుడి తల్లిని ప్రశ్నించిన అధికారులు, ఆమె నుంచి వివరాలు సేకరించే పనిలో పడ్డారు. కుమారుడు ఢిల్లీ సిఎంను కలిసేందుకు వెళ్లిన విషయం తనకు తెలియదని ఆమె చెప్పినట్లు సమాచారం. అతడు జంతు ప్రేమికుడని, ఇటీవల వీధి శునకాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో అసంతృప్తిగా ఉన్నాడని పేర్కొన్నట్లు తెలుస్తోంది. అయితే, అతడి మానసిక పరిస్థితి బాగా లేదని, గతంలోనూ ఓసారి ఢిల్లీ వెళ్లి వచ్చా డనిపోలీసులకు వివరించినట్లు సమాచారం. అజీ డ్యామ్ ప్రాంతంలో నివాసముండే రాజేశ్‌పై స్థానిక పోలీస్ స్టేషన్‌లో తొమ్మిది కేసులు ఉన్నట్లు సమాచారం. 2017-22 మధ్యకాలంలో బెదిరింపులు, స్థానికులపై దాడి, మద్యం మత్తులో దుష్ప్రవర్త నకు సంబంధించి ఈ కేసులు నమోదైనట్లు తెలిసింది.

అయితే జైల్లో ఉన్న బంధువు విడుదల కోసం వెళ్లినట్లు వార్తలు వచ్చినప్పటికీ అటువంటిదేమీ లేదని గుజరాత్ పోలీసులు గుర్తించినట్లు వెల్లడైంది.

ఇదిలా ఉంటే ఢిల్లీ సివిల్ లైన్స్‌లోని సిఎం అధికారిక నివాసంలో 'జన్ సున్‌వాయ్' నిర్వహిస్తున్న సమయంలో ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై రాజ్‌కోట్ వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. కొన్ని పేపర్లను సిఎంకు అందించిన తర్వాత అతడు గట్టిగా అరుస్తూ సిఎంపై దాడి చేసినట్లు ప్రత్యక్ష సాక్షులు మీడియాకు వెల్లడించారు. ఈ ఘటనను బిజెపి సహా విపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి.

# ఆగిపోని చమురు కుంపట్లు.. ట్రంప్ కార్యవర్గం లక్ష్యమే భారత్!



**వాషింగ్టన్, ఆగస్టు 21:** రష్యా చమురుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కార్యవర్గం గత 10 రోజులుగా అదేపనిగా భారత్‌ను లక్ష్యంగా చేసుకొని ప్రకటనలు గుప్పిస్తోంది. ముఖ్యంగా అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈసారి భారత పారిశ్రామిక వేత్తలను లక్ష్యంగా చేసుకొన్నారు. పశ్చిమదేశాలు విధించిన ఆంక్షల లబ్ధిని భారత్ పొందుతోందని ఆరోపించారు. సిఎన్‌బిసికి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ భారత వైఖరి ఆమోదయోగ్యం కాదన్నారు. 'రష్యా నుంచి భారత్ చౌకగా చమురు కొనుగోలు చేసి.. దానిని ఉత్పత్తి చేసినట్లు బయట విక్రయిస్తోంది. ఈ యుద్ధ సమయంలో ఇది మొదలుపెట్టింది. దీనిని ఏమాత్రం ఆమోదించలేము. వారు మారువిక్రయం చేసి.. లబ్ధి పొందుతున్నారు. 16 బిలియన్ డాలర్ల వరకు వారికి మిగులుతున్నాయి. ఈ వ్యవహారంలో భారత్‌లోని కొన్ని సంపన్న కుటుంబాలు భాగస్వామ్యం అయ్యాయి. యుద్ధానికి భారత్ రష్యా నుంచి 1 శాతం చమురు కొనుగోలు చేస్తే.. సంక్షోభం మొదలయ్యాక అది 40 శాతానికి చేరింది' అని బెస్సెంట్ పేర్కొన్నారు. మరోవైపు అమెరికా మాజీ అధ్యక్షుడు జార్జి డబ్ల్యు బుష్ సలహాదారు సిఎన్‌బిసితో మాట్లాడుతూ అమెరికా కోరిక మేరకు భారత్ పెద్దఎత్తున రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందన్నారు. ప్రస్తుతం ఆయన రాపిడన్ ఎనర్జీకి ప్రెసిడెంట్‌గా చేస్తున్నారు. బైడెన్ కార్యవర్గం రష్యా నుంచి వచ్చే చమురు తీసుకోమని భారత్‌ను కోరిందన్నారు. చమురు ధరల్లో భారీ వృద్ధి ఉండకుండానే ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అమెరికా రూపొందించిన ఆంక్షల చట్రంలో భారత్ ధరలను అదుపు చేసే పాత్రను పోషించిందన్నారు.

# కేంద్రం బిల్లును సమర్థించిన శశిథరూర్

## కాంగ్రెస్ వైఖరికి భిన్నంగా వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** గత కొంతకాలంగా కాంగ్రెస్ విధానాలతో విభేదిస్తున్నారు ఆ పార్టీ ఎంపి శశి థరూర్. తాజాగా తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజులపాటు నిర్బం ధంలో ఉంటే ప్రధానమంత్రినైనా, కేంద్ర మంత్రినైనా పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న సరికొత్త బిల్లుపైకూడా ఆయన పార్టీ అధిష్టా నానికి భిన్నంగా వ్యాఖ్యలు చేశారు.

ఈ బిల్లును ప్రతిపక్ష ఎంపిలు తీవ్రంగా వ్యతిరేకి స్తున్నారు. దీనిపై కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ మాట్లాడుతూ ఈ బిల్లు క్రూరమైన దన్నారు. అన్యాయంగా ముఖ్యమంత్రులను అరెస్టు చేస్తే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమన్నారు. అయితే, విపక్షాలు ఈ బిల్లును వ్యతిరేకించడాన్ని శశిథరూర్ తప్పుబట్టారు. ఇది ఇంగిత జ్ఞానానికి సంబం ధించిన విషయం. ఇందులో నాకు ఎలాంటి తప్పు కనిపించడంలేదు అని ఓ వార్తా సంస్థతో పేర్కొన్నారు. ఈ బిల్లును మరింత అధ్యయనం చేసేందుకు సెలక్ట్ కమిటీకిపంపే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొ న్నాయి. దీనిపై థరూర్ మాట్లాడుతూ అదిఎంతో మంచి విషయ మన్నారు.

అది మనప్రజాస్వామ్యానికి ఎంతో మేలు చేస్తుం దని తాను భావిస్తున్నట్లు తెలిపారు. తీవ్రమైన నేరారోప ణలతో అరెస్టయి వరుసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధానమంత్రి నైనా, కేంద్రమంత్రినైనా పదవి నుంచి తొలగిం చేందుకు వీలు కల్పించే బిల్లు ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమైంది. కనీసం అయిదేళ్ల శిక్ష పడే నేరానికి పాల్పడి, అరెస్టయి నెల రోజులు నిర్బంధంలో ఉంటే 31వ రోజున వారి పదవి పోయేలా నిబంధనను ఈ బిల్లులో చేర్చారు. వారంత వారు రాజీనామా చేయకపోయినా కొత్త నిబంధన ప్రకారం పదవిని కోల్పోతారు.

# అలాస్కా వ్యక్తికి 'పుతిన్' గిఫ్ట్‌గా ఖరీదైన యూరల్ బైక్!

**వాషింగ్టన్, ఆగస్టు 21:** రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇటీవల అలాస్కాలో ట్రంప్‌తో భేటీ అయిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఓ ఆసక్తి కర పరిణామం చోటుచేసుకుంది. అలాస్కాకు చెందిన ఓ వ్యక్తికి రూ. 19లక్షల విలువైన బైక్‌ను పుతిన్ బహుమతిగా ఇచ్చారు. రష్యాలో తయా రైన యూరల్ బైక్‌ను అతడు వాడుతుండటమే అందుకు కారణం. ఈ ఊహించని పరిణామానికి అలాస్కా వ్యక్తి ఆనందంతో మునిగిపోయాడు. అలాస్కా వేదికగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌ల భేటీ జరిగింది. అంతకు ఓవారం ముందే యాంకరేజ్‌కు చేరు కున్న రష్యన్ మీడియా ప్రతినిధులు స్థానికులతో ముచ్చటించే ప్రయత్నం చేశారు. ఈ సమ యంలో యూరల్ కంపెనీకి చెందిన ఓ పాత బైక్ వాడుతున్న మార్క్ వారెన్ అనే రిటైర్డ్ ఫైర్ ఇన్‌స్పెక్టర్ రష్యా జర్నలిస్టుల కంటపడ్డాడు. ఈ బైక్‌అంటే చాలాఇష్టమని చెప్పినవారెన్.. యుద్ధం నేపథ్యంలో ఆ బైక్ విడిభాగాలు దొరక ట్లేదని, నిర్వహణ కష్టంగా మారిందని వాపో యాడు. ట్రంప్-పుతిన్ భేటీ వల్ల ఈ యుద్ధానికి ముగింపు లభిస్తే ప్రయోజనం ఉంటుందా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు అవునంటూ సమా ధానమిచ్చాడు.

ఇందుకు సంబంధించిన న్యూస్ రష్యాలో వైరల్‌గా మారింది. క్రెమ్లిన్ దృష్టికీ వెళ్లింది. దీంతో స్పందించిన రష్యా అధికారులు వారెన్‌కు ఫోన్ చేసి బైక్ గురించి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. పుతిన్ వచ్చిన విమానంలోనే ఆ బైక్‌ను తీసుకొచ్చినఅధికారులు.. అమెరికా అధికారుల సాయంతో స్థానిక ఎంబసీకి తరలిం చారు. భేటీ మరుసటి రోజు దీనిని వారెన్‌కు అప్పగించే ఏర్పాట్లు చేశారు. సతీమణితో రష్యా ఎంబసీకి వెళ్లిన వారెన్‌కు.. రష్యా అధ్యక్షుడు మీకు ఇచ్చిన బహుమానం ఇదేనని బైక్‌ను చూపించడంతో ఆనందంతో మునిగిపోయాడు.



# గాజాపై ఇజ్రాయెల్ మలిదశ పోరాటం

## రంగంలోకి 50 వేల మంది రిజర్వ్ బలగాలు!

**టెల్అవీవ్, ఆగస్టు 21:** గాజా నగరంపై పూర్తిస్థాయిలో పట్టు సాధించే దిశగా అడుగులు వేస్తున్న ఇజ్రాయెల్ సైన్యం మరో దశ సమరానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రణాళికకు అత్యున్నత స్థాయి సైనికాధికారులు ఆమోదం తెలిపినట్లు సైనికవర్గాలు వెల్లడించాయి. ఇందుకోసం రానున్న రోజుల్లో దాదాపు 50 వేల మంది రిజర్వు బలగాలను రంగంలోకి దించనున్నట్లు పేర్కొన్నాయి. గాజా నగరంలోని పలు ప్రాంతాల్లో హమాస్ ఇంకా చురుకుగా ఉన్నట్లు ఇజ్రాయెల్ సైన్యం భావిస్తోంది. తమ సైన్యం కార్యకలాపాలు లేని అటువంటి ప్రాంతాలపై దృష్టి పెట్టామని.. త్వరలోనే అక్కడ సైన్యాన్ని మోహరించే ప్రయత్నాలు చేస్తున్నామని ఓ అధికారి వెల్లడించారు. ఇందుకు సంబధించిన ప్రణాళిక తుది దశలో ఉందన్నారు. అయితే, ఈ ఆపరేషన్ ఎప్పుడు మొదలవుతుందనే విషయంపై స్పష్టత లేదు. రానున్న నెలల్లో 50 మంది రిజర్విస్టులను రంగంలోకి దించనున్నట్లు ఆ అధికారి వెల్లడించారు. దీంతో క్రియాశీల రిజర్విస్టుల సంఖ్య 1.2 లక్షలకు చేరుకుంటుం దన్నారు.

మరోవైపు గాజాను స్వాధీనం చేసుకోవాలనే ప్రతిపాదనకు సెక్యూరిటీ కేబినెట్ ఆమోదం తెలిపినట్లు ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం ఇటీవల ప్రకటించింది. ఐడిఎఫ్ దళాలు ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవడానికి సిద్ధమవుతున్నాయని, యుద్ధభూమికి వెలువల ఉన్న ప్రజలకు మానవతా సాయం అందించనున్నట్లు పేర్కొంది. ఈ చర్య హమాస్ దగ్గర బందీలుగా ఉన్న వారిని వెనక్కి తీసుకొచ్చే ప్రణాళికలలో భాగమని వివరించింది. అయితే, ప్రధాని నెతన్యాహు మాత్రం గాజాను స్వాధీనం చేసుకోవడం తమ ప్రణాళిక కాదన్నారు. హమాస్‌ను నాశనం చేసి బందీలను వెనక్కి తీసుకున్న తర్వాత, ఆ ప్రాంతాన్ని తాత్కాలిక ప్రభుత్వానికి అప్పగించడమే తమ లక్ష్య మన్నారు.

# పాక్ క్రికెటర్ వాసిం అక్రంపై బెట్టింగ్ యాప్ కేసు

**హైదరాబాద్, ఆగస్టు 21:** భారత్‌లో బెట్టింగ్ యాప్‌లకు సంబంధించి సినీ తారలతో పాటు క్రికెటర్లు, సెలబ్రటీలపై కేంద్ర దర్యాప్తు స ంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ)తో పాటు ఆయా రాష్ట్రాలు వేరు వేరుగా కేసులు నమోదు చేయడం తెలిసిందే. దీనికి సంబంధించి నింది తులుగా వున్న వారిలో క్రికెటర్ సురేష్ రైనా, టాలీవుడ్ నటులు పలువురిని ఈడీతో పాటు ఆయా రాష్ట్రాల పోలీసులు ఇప్పటికే విచారించి వారి వాంగ్మూలం కూడా తీసుకు న్నారు. ఇప్పుడు ఇదే బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేసినందుకు పాకిస్తాన్‌కు చెందిన దిగ్గజ క్రికెటర్ వాసిం అక్రంపై లాహోర్ లోని నేషనల్ సైబర్ క్రైం ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్‌సిసిఐఎ)లో కేసు నమోదయ్యింది. లాహోర్‌కు చెందిన ఫైజ్ అనే వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు వాసిం అక్రంపై కేసు నమోదయ్యింది. వాసిం అక్రం కొన్నేళ్లుగా బాజీ అనే విదేశీ బెట్టింగ్ యాప్‌కు బ్రాండ్ ప్రమోటర్‌గా వ్యవహరిస్తున్నాడని ఫైజ్ తన ఫిర్యాదులో తెలిపాడు. దీనికి సంబంధించి సోషల్ మీడియాలో వున్న పోస్టర్లు, వీడియో క్లిప్‌ను అతను పోలీసులకు అందించాడు. వాసిం అ క్రం వంటి సెలబ్రటీ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేయడం వల్ల సామాన్యులు ముఖ్యంగా యువత జూదం వైపు మళ్లీ అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆ ఫిర్యాదులో ఫైజ్ తెలిపాడు. ఇందుకుగానూ వాసిం అక్రంపై ఎలక్ట్రానిక్ క్రైం యాక్ట్ 2016 కింద చర్యలు తీసుకోవాలని ఫిర్యా దిదారుడు కోరాడు. ఈ ఫిర్యాదు మేరకు ఎన్‌సిసిఐఎలో వాసిం అక్రంపై కేసు నమోదయ్యింది.

# ఆడుకుంటూ కారులోకి వెళ్లిన అన్నదమ్ములు



## ఆటో లాక్ పడి ఊపిరాడక మృతి

**జైపూర్, ఆగస్టు 21:** ఆట ఆడుకుంటూ కారులోకి వెళ్లిన ఇద్దరు అన్నదమ్ములు మరణించారు. కారు ఆటో లాక్ పడటంతో ఊపిరాడక అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు. తమ పిల్లలు కనిపిచడం లేదని వెతికినా తల్లిదండ్రులకు ఇంటికి కేవలం 20 మీటర్ల దూరంలో పార్క్ చేసిన కారులో విగత జీవులుగా కనిపించారు. ఈ ఘటన రాజస్థాన్‌లో జరిగింది. ఇది ప్రమాదవశాత్తూ జరిగిన ఘటనగా పోలీసులు భావిస్తుండగా, తల్లిదండ్రులు మాత్రం హత్య అని అనుమానిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, జయపుర్‌లోని గలతా గెట్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన ఇద్దరు మైనర్ సోదరులు మంగళవారం సాయంత్రం అకస్మాత్తుగా కనిపించకుండా పోయారు. ఒకరికి 8 యేళ్లు కాగా, మరొకరికి 5సంవత్సరాల వయసు ఉంటుంది. వారి కుటుంబసభ్యులు అర్ధరాత్రి వరకు వెతికినా, ఎక్కడా ఆచూకీ లభించలేదు. చివరకు తమ పిల్లలు కనిపించడం లేదని గలతా గెట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే ఆ పిల్లల ఇంటి చుట్టుపక్కల ప్రాంతాల్లో పోలీసులు వెతకడం ప్రారంభించారు. ఇంటికి కొంచెం దూరంలో పార్క్ చేసి ఉన్న కారులో ఆ పిల్లల మృతదేహాలు కనిపించారు. ఆ మైనర్ సోదరులు ఊపిరాడక మృతి చెందారని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని ఏసిపి రామ్ గంజ్ తెలిపారు. చిన్నారులు ఇద్దరు ఆటలాడుతూ కారులో వెళ్లారు. అది ఆటో లాక్ కావడం వల్ల లోపలే చిక్కుపోయారు. దీంతో ఊపిరాడక మృతి చెంది ఉంటారని తెలిపారు.

శవపరీక్షల నిమిత్తం మృతదేహాలను ఎస్‌ఎంఎస్ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. అలాగే ఫోరెన్సిక్ బృందాన్ని పిలిపించి కారులోని వేలిముద్రలను సేకరించినట్లు తెలిపారు. ఆ ప్రాంతం చుట్టుపక్కల ఉన్న సిసిటివిలను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. దర్యాప్తు తర్వాతే స్పష్టత వస్తుందని అన్నారు. అయితే తల్లిదండ్రులు మాత్రం తమ పిల్లలను హత్య చేసినట్లుగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మృతదేహాలపై గాయాలు ఉన్నట్లు ఆరోపిస్తున్నారు. ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న స్థానిక ఎమ్మెల్యే రఫీక్‌ఖాన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

# ప్రియుడితో దొరికిన భార్య - వారిద్దరికీ వివాహం చేసిన భర్త!

**లక్నో, ఆగస్టు 21:** ఆ ఇద్దరికి వివాహం జరిగి 25 యేళ్లు. వారికి ఇద్దరు ఎదిగిన పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో భార్య తన ప్రియుడితో కలిసి రెడ్ హ్యాండెడ్‌గా భర్త కంటపడింది. దాంతో ఆ భర్త విచిత్రమైన నిర్ణయం తీసుకున్నాడు. ఇద్దరికీ దగ్గరుండి వివాహం జరిపించాడు! ఉత్తరప్రదేశ్ లోని వారణాసి నగరంలో ఈ ఘటన జరిగింది. ఈ వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. మీర్జాపూర్ జిల్లాకు చెందిన అర్వింద్ పటేల్, చందౌలి జిల్లా హమీద్‌పూర్‌కు చెందిన రీనాకు 25 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. పాతికేళ్లుగా ఇద్దరూ కాపురం చేస్తున్నారు. వారికి ఇద్దరు ఎదిగిన పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో రీనాకు చందౌలికే చెందిన సియారామ్ యాదవ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం క్రమంగా వివాహేతర బంధానికి దారితీసింది. సియారామ్ గతంలో అర్వింద్ పటేల్‌కు చెందిన దుకాణంలో పనిచేసేవాడు. ఆ సమయంలోనే అతడికి రీనాతో పరిచయం ఏర్పడింది. అది క్రమంగా వివాహేతర బంధానికి దారితీసింది.

# పాకిస్థాన్‌కు అది సిగ్గు చేటు

## ఐరాసలో దాయాది దురాగతాలను ఎండగట్టిన భారత్

**న్యూయార్క్, ఆగస్టు 21:** పాకిస్థాన్‌లో మైనారిటీ వర్గాల మహిళలపై లైంగిక హింస నేటికీ కొనసాగుతోందని భారత్ ఆందోళన వ్యక్తం చేసింది.

మునుపటి తూర్పు పాకిస్థాన్‌లో వేలాది మంది మహిళలపై దారుణమైన నేరాలకు పాల్పడిన చరిత్ర పాక్ సైన్యానిదని, అయినప్ప టికీ వారిపై చర్యలు శూన్యమని దుయ్యబట్టింది. ఆ దురాగతాలు నేటికీ కొనసాగుతున్నాయని ఐరాస వేదికగా మండిపడింది.

'1971లో మునుపటి తూర్పు పాకిస్థాన్‌లో వేలాది మంది మైనారిటీ వర్గాల మహిళపై దారుణమైన లైంగిక హింసకు పాల్పడిన చరిత్ర పాక్ సైన్యానిది. అయినప్పటికీ నిందితులపై ఎటువంటి శిక్షలు విధించకపోవడం సిగ్గుచేటు. అటువంటి దుర్భర పరిస్థితి నేటికీ పాక్‌లో కొనసాగుతోంది. మహిళల అపహరణ, అక్రమ రవాణా, బాల్య వివాహాలు, లైంగికహింస, బలహీనవర్గాల మహిళ బలవంతపు మత మార్పిడిలు, బాలికలపై వేధింపులకు సంబం ధించి ఐరాస మానవ హక్కుల కమిషన్‌తోపాటు ఎన్నో అంతర్జాతీయ సంస్థలు తమ నివేదికల్లో వివరించాయి' అని ఐరాసలో భారత రాయబారి ఎల్డోస్ మాథ్యూ పున్నూస్ వెల్లడించారు.

ఐరాస భద్రతా మండలిలో 'సంఘర్షణ- సంబం ధిత లైంగిక హింస' అనే అంశంపై పున్నూస్ ప్రసంగిస్తూ పాక్ తీరును ఎండగట్టారు. గతంలో బంగ్లాదేశ్‌లో మహిళలపై పాకిస్థాన్ సైన్యం చేసిన దురాగతాలను ప్రపంచం ముందుంచారు. వీటికి అక్కడి న్యాయవ్యవస్థకూడ వంత పాడు తోందని విమర్శలు గుప్పించారు. క్రూరమైన చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేసిన ఆయన.. హేయమైన చర్యలకు పాల్పడేవారిని శిక్షించాలన్నారు. సంఘర్షణ ప్రాంతాల్లో లైంగిక హింస అనేది వ్యక్తిగత జీవితాలను నాశనం చేయడమే కాకుండా సమాజంలోనూ భయాలను సృష్టిస్తుం దన్నారు.

ఇటువంటి అంశాలకు పరిష్కార మార్గం చూపిన దేశాల్లో భారత్ ఒకటని, సెక్రటరీ జనరల్ ట్రస్ట్ ఫండ్‌కు సాయం అందిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు.

# నిషేధం కాదు.. నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

## ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్‌పై కేంద్ర మంత్రి అమిత్ షాకు గేమింగ్ ఫెడరేషన్ లేఖ

**న్యూఢిల్లీ,ఆగస్టు 21:** ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ ఆగడాలు ఇటీవల మరీ పెరిగిపోయాయి. దీన్ని అరికట్టడంలో భాగంగా 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు'ను తీసుకొచ్చేందుకు కేంద్రం సిద్ధమైన సంగతి తెలిసిందే. ఈ బిల్లుపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఆల్ ఇండియా గేమింగ్ ఫెడరేషన్ కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు లేఖ రాసింది. ఆన్‌లైన్ బెట్టింగ్‌లను అరికట్టేందుకు కేంద్రం తీసుకొచ్చే బిల్లు కారణంగా తమ రంగానికి తీవ్ర నష్టం కలుగుతుందని ఎఐజీఎఫ్ ఆందోళన వ్యక్తం చేసింది.

ఇది అమల్లోకి వస్తే తమ పరిశ్రమకు భారీ నష్టం జరుగుతుందని, కోట్ల మంది చట్టబద్ధమైన గేమర్‌లు అక్రమంగా నెట్‌వర్క్‌లను నడిపేవారి వైపు వెళ్లేలా చేస్తుందని ఆవేదన వ్యక్తం చేసింది. అంతేగాక ఈ రంగంలోని అనేక మంది ఉద్యో గులపై కూడా దీని ప్రభావం ఉంటుందని హెచ్చ రించింది. ఈ సందర్భంగా దీన్ని పూర్తిగా నిషేధం విధించేకంటే దానిపై నియంత్రణ చర్యలు తీసుకోవాలని కేంద్రానికి సూచించింది. ఆటగాళ్లను రక్షించడంతో పాటు వారు బాధ్యతా యుతంగా ఆడేలా చర్యలు తీసుకోవాలని కోరింది. కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించా లని, పరిశ్రమను పూర్తిగా చీకట్లోకి నెట్టేయొద్దని అభ్యర్థించింది. ఈ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ వాడకం ఇటీవల విపరీతంగా పెరిగిపోయింది.

దీనికి బానిసైన కొందరు అప్పుల ఊబిలో కూరుకుపోయి ప్రాణాల మీదకు తెచ్చుకుంటు న్నారు. వీటిని ప్రమోట్ చేసిన ప్రముఖులు ప్రస్తుతం దర్యాప్తు సంస్థల నుంచి విచారణ ఎదుర్కొంటున్నారు.

ఈ క్రమంలోనే ఆన్‌లైన్ బెట్టింగ్‌ను నేరంగా పరిగణిస్తూ 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు'ను తీసుకువచ్చేందుకు కేంద్రం సిద్ధమైంది. ప్రధాని మోడీ నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో దీనికి ఆమోదం లభించిందని అధి కార వర్గాలు తెలిపాయి. నేడు దీన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

# సంక్షిప్తంగా..

## అఫ్ఘాన్ బస్సులో మంటలు, 71 మంది మృతి


**కాబూల్, ఆగస్టు 21:** అఫ్ఘానిస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఇరాన్ నుంచి తరలిపోతున్న వలసదారుల బస్సుకు మంటలు అంటుకున్నాయి. ఈ ఘటనలో 71 మంది ప్రాణాలు కోల్పోయారు. అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం.. పశ్చిమ హెరాత్ ప్రావిన్స్‌లో ఈ ప్రమాదం జరిగింది. ఇరాన్ నుంచి ఇటీవల బహిష్కరణకు గురైన అఫ్ఘాన్ వలసదారులతో వెళ్తున్న బస్సు, మోటార్‌సైకిల్ ఢీకొన్నాయి. దీంతో బస్సులో మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందితో సహా స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనలో 17 మంది చిన్నారులతో సహా 71 మంది ప్రాణాలు కోల్పోయారు. మరికొంతమంది గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి.. చికిత్స అందిస్తున్నాం. మోటార్‌బైక్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు కూడా మృతి చెందారు. నిర్లక్ష్యం, అతివేగం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. దీనిపై పూర్తి స్థాయి విచారణ కొనసాగుతోంది. కాగా.. అఫ్ఘాన్ శరణార్థులపై ఉక్కుపాదం మోపుతున్న ఇరాన్, పాకిస్థాన్ భార డిపోర్టేషన్ చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ యేడాది ప్రారంభం నుంచి దాదాపు 1.5 మిలియన్ల మందికిపైగా అఫ్ఘాన్‌లు ఇరాన్, పాకిస్థాన్ నుంచి బలవంతంగా స్వదేశానికి తిరిగివచ్చారు.

## అగ్ని 5 బాలిస్టిక్ క్షిపణి పరీక్ష విజయవంతం



**భువనేశ్వర్, ఆగస్టు 21:** భారత్ 'అగ్ని 5' బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరం డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం ద్వీపం నుంచి ఈ క్షిపణిని పరీక్షించింది. ఇది అణు సామర్థ్యం ఉన్న స్వదేశీ క్షిపణి. ఇది రక్షణ రంగంలో దేశానికి ఉన్న బలమైన సామర్థ్యాన్ని మరోసారి నిరూపించింది. ఈ పరీక్షను డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఒ) నిర్వహించింది. 'అగ్ని 5' ఇంటర్మీడియట్ రేంజ్ బాలిస్టిక్ క్షిపణి 5,000 కిలోమీటర్ల వరకు లక్ష్యాలను ఛేదించగలదు. ఒకేసారి బహుళ లక్ష్యాలను ఛేదించగల సామర్థం దీని సొంతం. శ్రేణి: 'అగ్ని 5' ఇంటర్మీడియట్ రేంజ్ బాలిస్టిక్ క్షిపణి, ఇది 5,000 కిలోమీటర్ల వరకు లక్ష్యాలను ఛేదించగలదు. టెక్నాలజీ: ఈ కిపణి మూడు దశల ఘన ఇంధన ఇంజిన్‌ను కలిగి ఉంది. లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం: 'అగ్ని 5' ఒకేసారి బహుళ లక్ష్యాలను ఛేదించగల సామర్థం దీని సొంతం.

## ఢిల్లీలో కుప్పకూలిన భవనం.. ముగ్గురు దుర్మరణం



**న్యూఢిల్లీ, ఆగస్టు 21:** భవనం కుప్పకూలిన ఘటనలో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. దేశ రాజధాని ఢిల్లీలోని దర్యాగంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. ఘటనపై సమాచారం అందిన వెంటనే ఢిల్లీ స్థానిక అధికారులు, ఢిల్లీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిబ్బంది రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో మరణించిన ముగ్గురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ ఆస్పత్రికి తరలించారు. కాగా ఘటనా స్థలంలో భవన శిథిలాల తొలగింపు కొనసాగుతోందని పోలీసులు చెప్పారు. ఘటనకు కారణాలపై నిర్ధారణకు వచ్చిన తర్వాత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

## ఢిల్లీలో పాఠశాలలకు బాంబు బెదరింపులు

**హైదరాబాద్, ఆగస్టు 21:** దేశ రాజధాని ఢిల్లీలో పలు పాఠశాలలకు మరోసారి బాంబు బెదిరింపులు వచ్చాయి. దాదాపు 50కి పైగా పాఠశాలలకు కొందరు దుండగులు ఈ మెయిల్స్ ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సోదాలు నిర్వహించారు. టెర్రరైజర్స్ 111గా పేర్కొనే ఒక గ్రూపు పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు బెదిరింపు మెయిల్స్ పంపించినట్లు పోలీసులు పేర్కొన్నారు. స్కూళ్లలోని కంప్యూటర్లు, కెమెరాలు అన్నీ ప్రస్తుతం తమ అధీనంలో ఉన్నాయన్నారు. 25,000 బిలియన్ డాలర్లు తమకు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. లేదంటే 48 గంటల్లో బాంబు పేల్చేస్తామని బెదిరించినట్లు వెల్లడించారు. మెయిల్స్ విషయాన్ని పోలీసులకు చెప్తే బాంబు పేల్చేయడంతో పాటు స్కూళ్లకు సంబంధించిన డేటాను లీక్ చేస్తామని హెచ్చరించారన్నారు. ఇదే గ్రూప్ ఇటీవల 5వేల బిలియన్ డాలర్ల కోసం ఇలాంటి బెదిరింపులకు పాల్పడినట్లు అధికారులు పేర్కొన్నారు.

# మహిళా పోలీసుల సమస్యలపై రాష్ట్రస్థాయి సదస్సు

## ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్క



రాష్ట్ర పోలీసు అకాడమిలో బుధవారం మొదలైన మహిళా పోలీసుల రాష్ట్రస్థాయి సదస్సులో ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్కకు పుష్ప గుచ్ఛం ఇచ్చిన అకాడమి డైరక్టర్ అభిలాష్ బిస్త్

**హైదరాబాద్, ఆగస్టు 21(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంలో పోలీసు శాఖతో పాటు జైళ్లు, అటవీ శాఖలో మహిళలకు సంబంధించి మొదటిసారిగా అన్ని కేట గిరిల అధికారులు, సిబ్బందికి సంబంధించిన సమస్యలపై రాష్ట్రస్థాయి సదస్సు బుధవారం మొదలయ్యింది. శివార్లలోని హిమాయత్ సాగర్ లో గల రాష్ట్ర పోలీసు అకాడమిలో ప్రారంభమైన ఈ మూడు రోజుల సదస్సును పంచాయత్ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సదస్సులో పోలీసు శాఖతో పాటు జైళ్లశాఖ, అటవీ శాఖల నుంచి కాని స్టేబుల్ నుంచి అంతకు పైస్థాయి అధికారులతో కలిపి 400మంది వరకు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లా డుతూ మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేబడుతుందని అన్నారు. పోలీసు శాఖలో పనిచేస్తున్న మహిళల కోసం కూడా పలు పథకాలను అమలు చేసిందని ఆమె తెలిపారు. పోలీసుశాఖతో పాటు జైళ్లు, అటవీ శాఖలో మహిళలు ఇతర అధికారులకు ఏమాత్రం తీసిపోకుండా ధైర్యంగా ముందుకు సాగాలని ఆమె కోరారు. మూడురోజుల పాటు జరిగే ఈ సదస్సుల సమస్యలపై చర్చించి సూచనలను రూపొందించి ప్రభుత్వానికి అందించాలని మంత్రి కోరారు. మహిళా పోలీసులకు లభిస్తున్న శిక్షణ, మౌలిక వసతులపై ప్రత్యేకంగా దృష్టి పెడతానని ఆమె హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన మహిళా పోలీసులకు మరింత ప్రోత్సాహం అందిస్తామని సీతక్క హామీ ఇచ్చారు. మహిళా పోలీసుల సమస్యల కోసం డిజిపి ప్రత్యేకంగా ఒక విభాగం ఏర్పాటు చేస్తే బాగుంటుందని మంత్రి సీతక్క సూచించారు. మహిళా పోలీసుల కోసం తమిళనాడు సహా ఇతర రాష్ట్రాలలో కల్పించిన సౌకర్యాలను అధ్యయనం చేయాలని, ఇందుకోసం ఒక బృందాన్ని ఆయా రాష్ట్రాలకు పంపాలని ఉన్నతాధికారులకు ఆమె ఆదేశించారు. మహిళా పోలీసుల ఆరోగ్యం కోసం మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు కౌన్సిలింగ్ వంటి కార్యక్రమాలు చేబట్టాలని మంత్రి సూ చించారు. మహిళా పోలీసులు పోలీసు స్టేషన్‌లో నే బాధితులుగా మారవద్దని ఆమె కోరారు.

భవిష్యత్తులో మహిళలు అన్ని రంగాలలో మరింత ముందుకు సాగాలని ఆమె ఆకాంక్షించారు. అంతకు ముందు అకాడమి డైరక్టర్ అభిలాష్ బిస్త్ నేతృత్వంలో మంత్రి సీతక్కకు సాయుధ పోలీసులతో స్వాగతం పలికి సభా వేదిక వద్దకు తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్స్ అదనపు డిజి స్వాతి లక్రా, సిఐడి చీఫ్ చారు సిన్హా, సీనియర్ ఐపిఎస్ అధికారిణి బాలనాగదేవి, డిఐజి రెమా రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు ప్రకటనలు ఇచ్చే సంస్థలపై కఠిన చర్యలు

## డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులకు మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆదేశం

**హైదరాబాద్, (జర్నలిస్ట్‌ఫైల్) ఆగస్టు 21:** మెడిసిన్ విషయంలో తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇచ్చే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులను వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆదేశించారు. ఈ మేరకు డ్రగ్ కంట్రోల్ అథారిటీ పనితీరుపై బుధవారం, వెంగళరావునగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. 2024, 2025లో డీసీఏ వర్క్ ప్రోగ్రెస్‌ను మంత్రికి డీసీఏ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం వివరించారు. 2024లో 25,939 తనిఖీలు నిర్వహించగా నిబంధనలు ఉల్లంఘించిన 4142 సంస్థలపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. అలాగే 2025లో జనవరి నుంచి జులై వరకు 16,481 తనిఖీలు చేసి.. నిబంధనలు ఉల్లంఘించిన 2827 సంస్థలపై చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. 2024 జనవరి నుంచి 2025 జులై వరకు 7200 మెడిసిన్ సాంపిల్స్‌ను టెస్ట్ చేయగా, అందులో 186 నాసిరకం మెడిసిన్‌గా తేలిందని, సంబంధిత సంస్థలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకున్నట్టు మంత్రికి చెప్పారు. సుమారు 700 కేసులు బుక్ చేశామని వివరించారు. ప్రతి కేసులోనూ దోషులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని



అధికారులను మంత్రి దామోదర ఆదేశించారు. జనాలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇస్తూ, మెడిసిన్ అమ్మకాలు జరుపుతున్న కంపెనీలు, వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. స్ప్యూరి యస్, నాట్ స్టాండర్డ్ డ్రగ్స్ తయారు చేస్తున్న ఫార్మా కంపెనీలు, డిస్ట్రిబ్యూటర్లు, అమ్మకందారులపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. మెడిసిన్ అనేది ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న అంశమని, ఈ విషయంలో ఎలాంటి ఉపేక్ష పనికిరాదన్నారు. పదే పదే నిబంధనలు ఉల్లంఘిస్తున్న సంస్థలను చట్టప్రకారం పర్మినెంట్‌గా క్లోజ్ చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నకిలీ, నిషేధిత మందుల తయారీ, అమ్మకం దారులపై అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేయాలని మంత్రి ఆదేశించారు. మెడిసిన్‌ను ఆహార పదార్థాలుగా చూపిస్తూ, వాటి తయారీ, అమ్మకాలు చేపడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. యాంటి బయాటిక్ రెసిస్టెన్స్ అనేది పెద్ద ముప్పుగా పరిణమిస్తోందని, నిబంధనలు ఉల్లంఘించి యాంటిబయాటిక్స్ అమ్మకాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు ప్రేరేపిత మెడిసిన్ అమ్మకాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డీసీఏ డీజీని మంత్రి ఆదేశించారు. డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్ అప్‌గ్రెడేషన్ పనులను స్పీడప్ చేయాలని మంత్రి ఆదేశించారు. త్వరలో మరిన్ని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులను మంజూరు చేసి, రిక్రూట్ చేస్తామని.. తద్వారా డ్రగ్ కంట్రోల్ అథారిటీని మరింత బలోపేతం చేస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ప్రజలకు క్వాలిటీ మెడిసిన్, క్వాలిటీ ఫుడ్ అందించే విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని మంత్రి దామోదర రాజనర్సింహా స్పష్టం చేశారు.

# స్థానికసంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయదుందుభి మోగించాలి

## ఆర్మూర్‌కు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు త్వరలో సిఎం శంకుస్థాపన: మహేష్‌కుమార్

**హైదరాబాద్ ఆగస్టు 21(జర్నలిస్ట్‌ఫైల్):** కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమంను ప్రజలకు వివరించి వారి మద్దతు కూడగట్టుకొని స్థానిక సంస్థల ఎన్నికలలో విజయదుందిభి మ్రోగించాలని వందకు వంద సర్పంచ్‌లు,ఎంటిపిసిలు,జడ్పీటిసిలు, ఎంపిపిలు, జడ్పీచైర్మన్లు కైవసం చేసుకోవాలని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపు నిచ్చారు. బుధవారం గాంధీభవన్‌లో ఆర్మూర్ ఇంచార్జ్ వినయ్ రెడ్డి పార్టీ ముఖ్య కార్యకర్తలతో టిపిసిసి చీఫ్ సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికలతో ప్రతి బూత్ లెవల్ లో పార్టీని పటిష్ఠంగా ముందుకు తీసుకొని పొయే అవకాశం ఉంటుందని దాని కోసం కృషిచేయాలని ఆయన మార్గనిర్దేశనం చేశారు. ఆర్మూర్ నియోజక వర్గంలో స్థానిక సంస్థల అన్నింటనిగెలవాలని అందుకు క్షేత్రస్థాయి లో పనిచేయాలని ప్రజలకు చేరువగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని ఆయనకోరారు. కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా కష్టపడి పని చేసి సర్పంచ్, ఎంపిటిసి, జడ్పీటిసీ, జిల్లా పరిషత్, మండల పరిషత్ లు అన్ని కాంగ్రెస్ పార్టీ గెలిచే విధంగా పకడ్బందీగా ప్రణాళికతో ముందుకు పోవాలని అన్నారు. ఆర్మూర్ నియోజక వర్గాన్ని నా స్వంత నియోజక వర్గంగా చూసుకుంటా అని చెప్పారు. కార్యకర్తలకు, నాయకులకు ఎలాంటి సమస్యలు వచ్చినా కలిసికట్టుగా పని చేసుకొని పరిష్కరించుకుందామని చెప్పారు. సమస్యలు ఉంటే ఇంచార్జ్ మంత్రి దృష్టికి తీసుకెళితే నేనే వెంట ఉండి పని చేసి పెడతా అని అన్నారు. ఆర్మూర్‌కు ప్రభుత్వం నుంచి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల మంజూరు అయిందని త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నామని అన్నారు. 42 శాతం బిసి రిజర్వేషన్లు విద్య, ఉద్యోగ,రాజకీయ రంగాలలో అమలు అయ్యేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా కృషి చేసిందని అన్నారు. బీజేపీ కేంద్రంలో అటు బిల్లు అమలు కాకుండా ఇటు ఆర్డినెన్స్ అమలు కాకుండా అడ్డు పడుతుందని బిజెపి, బిఆర్ ఎస్ రెండు పార్టీలు కుమ్మక్కు అయ్యి బిసి రిజర్వేషన్లు అమలు కాకుండా అడ్డుపడుతున్నాయని ఇది ప్రజలు గమనించాలని ఆయన అన్నారు.కులాల వాటా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని రాహుల్ గాంధీ గారు మొట్టమొదట ఉద్యమాన్ని లేవనెత్తారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రివర్గం ఎంతో కృతనిశ్చయంతో బిసి రిజర్వేషన్లు అమలు చేసేందుకు అన్ని రకాలుగా చర్యలు తీసుకున్నారని అందుకోసం వారికి ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వీటిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని అన్నారు. రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల కరెంట్ ఫ్రీ, ఆర్టీసీ లలో మహిళలకు ఉచిత రవాణా, 500 రూపాయలకు గ్యాస్, 2 లక్షల రూపాయల వ్యవసాయ రుణాల మాఫీ, ఎకరాకు 12 వేల రైతు భరోసా, రెసిడెన్షియల్ స్కూల్స్, స్పోర్ట్స్ పాలసీ, ఫోర్త్ సిటీ లాంటి అనేక విప్లవాత్మక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని ఇవన్నీ కార్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో ఏ ప్రభుత్వం చేయనంత వేగంగా పకడ్బందీగా చేస్తున్న అంశాలలో ప్రచారం చేసి స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించేలా చూడాలని అన్నారు.



# రాజీవ్‌కు ఘనంగా నివాళులు

## ఎన్ఎస్‌యుఐ రక్తదాన శిబిరంప్రారంభించిన టిపిసిసి చీఫ్

**హైదరాబాద్,ఆగస్టు 21(జర్నలిస్ట్‌ఫైల్):** రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా బుధవారం గాంధీభవన్‌లో మాజీప్రధాన మంత్రి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేషన్ చైర్మన్ ఫహీం ఖురేషి, మాజీ ఎంపీ వి హనుమంతరావు.తదితరులు పాల్గొని రాజీవ్ చేసిన కృషి కారణంగానే దేశంలో సాంకేతిక విప్లవం అభివృద్ధి చెందినందని అన్నారు. టపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ దేశంలో కంప్యూటర్ యుగంలోకినడిపారని,నవోదయ విద్యాలయం భావనతో విద్యలో మెరుగైనపద్ధతులు తీసుకొచ్చారని కొనియాడారు. ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంను టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు.

# మద్యం షాపుల టెండర్లకు ఆహ్వానం

## దరఖాస్తు ఫీజు రూ.3 లక్షలు

**హైదరాబాద్,ఆగస్టు 21(జర్నలిస్ట్‌ఫైల్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మద్యం దుకాణాలకు టెండర్లను ఆహ్వానించింది. డిసెంబర్ 1, 2025 నుంచి నవంబర్ 30, 2027 వరకు లైసెన్స్ కాలం ఉంటుందని, ఈ సారి దరఖాస్తు ఫీజు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచుతూ నోటిఫికేషన్ విడుదల చేశారు. మద్యం దుకాణాల కేటాయింపుల్లో గౌడకులస్తులకు 15 శాతం,ఎస్సీ సామాజిక వర్గాలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం దుకాణాలను కేటాయించనున్నారు.తెలంగాణ ప్రభుత్వం కొత్త మద్యం పాలసీని ప్రకటించింది.2025-2027 సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణాల లైసెన్సుల కోసం ఎక్సైజ్‌శాఖ ఒక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.తెలంగాణలోని 2620 మద్యం షాపుల కు లైసెన్స్ కొరకు ఎక్సైజ్ శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం ఉన్న దుకాణాల గడువు నవంబర్ 30వ తేదీతో ముగియనుంది. ఈ కొత్త లైసెన్సుల గడువు డిసెంబర్ 1, 2025 నుంచి నవంబర్ 30, 2027 వరకు ఉంటుంది. ఈసారి దరఖాస్తు రుసుమును రెండు లక్షల నుంచి మూడు లక్షల రూపాయలకు పెంచారు. దుకాణాల లైసెన్సులను వార్షిక ఎక్సైజ్ పన్ను ఆధారంగా లాటరీ ద్వారా కేటాయించనున్నారు.ఈ మద్యం పాలసీలో రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇచ్చింది. గౌడ సామాజిక వర్గానికి 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం దుకాణాలను రిజర్వ్ చేశారు. ఇలా మొత్తం 30 శాతం రిజర్వేషన్లకు కేటాయించారు. వీటితో పాటు.. భాగస్వామ్య సంస్థలు, కంపెనీలు కూడా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. అంతేకాకుండా ఒకే దరఖాస్తుదారుడు ఒక దుకాణానికి కంటే ఎక్కువ దరఖాస్తులు సమర్పించేందుకు అవాకాశం కల్పించారు.మొత్తం ఆరు స్లాబులుగా ఈ లైసెన్సుల ఫీజులను నిర్ణయించారు. ఇది 2011 జనాభా లెక్కల ఆధారంగా రూపొందించబడింది. ఐదు వేల లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో వార్షిక ఎక్సైజ్ పన్ను రూ. 50 లక్షలుగా, 5,000 నుండి 50,000 మధ్య జనాభా ఉన్నచోట రూ. 55 లక్షలుగా, 50,000 నుంచి ఒక లక్ష వరకు ఉన్న ప్రాంతాలకు రూ. 60 లక్షలుగా, ఒక లక్ష నుంచి ఐదు లక్షల మధ్య జనాభా ఉన్న ప్రదేశాల్లో రూ. 65 లక్షలుగా నిర్ణయించారు. ఐదు లక్షల నుంచి 20 లక్షల వరకు జనాభా ఉంటే రూ. 85 లక్షలు, ఇక 20 లక్షల పైన జనాభా ఉన్న నగరాల్లో వార్షిక ఫీజు రూ. కోటి పది లక్షలుగా ఖరారు చేశారు.లాటరీ ద్వారా దుకాణాలను పొందినవారు వార్షిక లైసెన్స్ రుసుమును ఆరు సమానవాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుంది. 25 నెలల లైసెన్స్ కాలానికి గాను, పావు వంతు (25 శాతం)కు సమానమైన బ్యాంక్ గ్యారెంటీని ప్రభుత్వానికి సమర్పించాలి. జీహెచ్ఎంసీ, నగర పంచాయతీ పరిధిలో మద్యం దుకాణాలను ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు, గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే తెరవడానికి అనుమతి ఉందని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

# ఐ సెట్ కౌన్సెలింగ్‌కి 2065 మంది దరఖాస్తు

## 28 వరకు స్లాట్ బుకింగ్‌కి: సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన

**హైదరాబాద్, (జర్నలిస్ట్‌ఫైల్) ఆగస్టు 21:** రాష్ట్రంలోని ఎంబిఏ, ఎంసిఏ సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ఐ సెట్-2025 కౌన్సెలింగ్ బుధవారం నుంచి ప్రారంభం కాగా.. మొదటి రోజు 2065 మంది ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకున్నట్టు సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఈ నెల 22 నుంచి 29 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించడానికి షెడ్యూల్‌ను జారీ చేశారు. అయితే ఈ నెల 27 ఆదివారం కావడంతో ఆ రోజు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉండదని ప్రకటించారు. ఈ నెల 25 నుంచి 30 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశమిచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి సెప్టెంబర్ 2న సీట్ల కేటాయింపు చేయనున్నారు.

# ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరిస్తున్నా ఎందుకు హైకోర్టుకు వెళ్లడం?

## పిసిఘోష్ నివేదికపై ఎందుకు కెసిఆర్, హరీష్ భయపడాలి: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్,ఆగస్టు 21(జర్నలిస్ట్‌ఫైల్):** మా ప్రభుత్వం అత్యంత ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరిస్తోందని,పిసిఘోష్ నివేదిక అంశంపై కెసిఆర్ హరీష్ రావు హైకోర్టుకు ఎందుకు వెళ్లారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. బుధవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సిఎల్‌పిలో విలేఖరులతో మాట్లాడుతూ కాళేశ్వరం అవినీతి పైన పిసి ఘోష్ ఇచ్చిన కమిషన్ రిపోర్ట్ సారాంశం ప్రజలకు తెలియకుండా రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం వద్దకు వెళ్లారని అన్నారు.నివేదిక అసెంబ్లీలో పెట్టకముందే హైకోర్టును ఆశ్రయించడం వల్ల ప్రజలకు నీళ్ళు ఏవో పాలు ఏవో తెలియకుండా పోతుందని అన్నారు. అసెంబ్లీ ముందు నివేదిక ను ఉంచుతామని ఇప్పటికే క్యాబినెట్ తేల్చి చెప్పిందని ఆయన గుర్తుచేశారు. అసెంబ్లీలో సమగ్రంగా చర్చించి నతర్వాత నివేదిక పైన ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఆయన అన్నారు. కాళేశ్వరం కమిషన్ ను చూసి కెసిఆర్, హరీష్ రావు ఎందుకు భయపడుతున్నారని ఆయన ప్రశ్నించారు. కాళేశ్వరం కమిషన్ పైనహైకోర్టును ఆశ్రయించడంతోనే కెసిఆర్ హరీష్ రావు తాము తప్పు చేశామని ఒప్పుకున్నట్లైందని భాష్యం చెప్పారు. కాళేశ్వరం కమిషన్ కూడా స్వయంగా కోర్టు లాంటిదే.. కమిషన్ ఛైర్మన్ కూడా స్వయంగా మాజీ న్యాయమూర్తి అని ఆయన అన్నారు.కాళేశ్వరం కమిషన్ లేవనెత్తిన అంశాలపైన సమాధానం చెప్పే దమ్ము లేక తప్పించుకోవడానికే కోర్టుకు వెళ్లారని విమర్శించారు. కాళేశ్వరంలో జరిగిన అనేక అవకతవకలను కమిషన్ స్పష్టం చేసిందని ఆయన తెలిపారు. దాదాపు ఆరు నెలల పాటు అనేక మందిని విచారించిన తర్వాతే కమిషన్ రిపోర్ట్ ఇచ్చింది.ఇంజనీర్ల ను కాదని కెసిఆర్ సొంతంగా నిర్ణయాలు తీసుకున్నారని ఇంజనీర్ల అఫిడవిట్ ఆధారంగా కమిషన్ తేల్చిందని ఆయన చెప్పారు. హరీష్ రావు, ఈటెల రాజేందర్ కూడా అడ్డగోలుగా వ్యవహరించిందని కమిషన్ స్పష్టం చేసిందని శ్రీనివాస్ ఆరోపించారు. తమ తప్పులను కమిషన్ ఎత్తి చూపడంతో కెసిఆర్ , హరీష్ రావు ఆత్మరక్షణలో పడ్డారని ఆయన అన్నారు. యూరియా కేటాయింపులు ఎవరి పరిధిలో ఉంటాయో కెటిఆర్‌కు తెలియదా అని ఆది ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం 9.80 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని కేంద్రానికి ఇండెంట్ పెట్టిందని ఈ ఆగస్టు వరకు 8.30 మెట్రిక్ టన్నులు రావాలి, కాని 5.40 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చిందని వివరించారు. యూరియా కేటాయింపు పైన కేంద్రం తీరు పైనప్రతిపక్షనేత కెసిఆర్ ఎందుకు స్పందించడంలేదు అని ఆయన ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుళ్ళు పైనే కెటిఆర్ విమర్శలు చేస్తున్నారని అన్నారు. రైతులపైన కెటిఆర్ కపట ప్రేమ చూపిస్తున్నారని దుయ్య బట్టారు.మా ఎంపీలు పార్లమెంట్‌లో కేంద్రాన్ని నిలదీస్తున్నారు.కెటిఆర్ కెసిఆర్ థర్డ్‌క్లాస్ ఆలోచనలు చేశారు కాబట్టే ప్రజలు ఓడించారని అన్నారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థి పైన ఇండియా కూటమి రాజకీయపరమైన నిర్ణయం తీసుకుంది. గతంలో దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని కెసిఆర్ చెప్పి మోసం చేశారు.కంచె ఐలయ్యకు మాపార్టీ ఎంతో గౌరవం ఇచ్చిందని ఆయన తెలిపారు.

# అర్చకులు ఇతర కార్యక్రమాలకు వెళ్లకూడదనే ఉత్తర్వులు సరికాదు

## తెలంగాణ అర్చక సమాఖ్య అధ్యక్షుడు గట్టు శ్రీ నివాసచార్యులు

**హైదరాబాద్,ఆగస్టు 21(జర్నలిస్ట్‌ఫైల్):** దేవాలయ అర్చకులు ఇతర కార్యక్రమాలకు వెళ్ళకూడదు అని దేవాదాయశాఖ ఇచ్చిన ఉత్తర్వులు సరికాదని తెలంగాణ అర్చక సమాఖ్య అధ్యక్షుడు గట్టు శ్రీ నివాసచార్యులు ఒక ప్రకటనలో విమర్శించారు. దేవాలయాల్లో అర్చక విధులు నిర్వహిస్తున్నవారు బయట ఈ ఇతర వివాహాది కార్యక్రమాలకు కానీ ఆశీర్వచనాలకు ఇతర దైవిక కార్యక్రమాలకు వెళ్లకూడదు అనేటువంటి ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.ఇది కేవలం ఆలయాలలో అర్చకత్వం నిర్వహిస్తున్నటువంటి అర్చకులకే కాదు తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి హిందూ మత ప్రచారం పై జరుగుతున్నటువంటి ఒక దౌర్జన్యం అని కూడా అనుకోవచ్చనే అభిప్రాయం వ్యక్తం చేశారు.ఆలయాల అభివృద్ధి దిశగా తీసుకు వెళుతున్న ఈ సమయంలో ఇటువంటి ఉత్తర్వులు మంచిది కాదని ఆయన హితవు పలికారు.ఈ అంశంపై ఉన్నతాధికారులు పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు.



# బాలుర ఆశ్రమ పాఠశాలలో నిద్రించిన మంత్రి జూపల్లి

**హైదరాబాద్,ఆగస్టు 21(జర్నలిస్ట్‌ఫైల్):** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్ మండలం మార్లవాయి గ్రామంలోని ప్రభుత్వ బాలుర ఆశ్రమ పాఠశాల వసతి గృహంలో నిద్రించిన మంత్రి జూపల్లి కృష్ణారావు..ఉదయం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. అంతకుముందు కిచెన్ ను పరిశీలించారు. తర్వాత విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు ప్రభుత్వం అందజేస్తున్న మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతుందా అని ప్రశ్నించారు. విద్యార్థులను పలు విషయ పరిజ్ఞానానికి సంబంధించిన ప్రశ్నలను అడిగారు.ప్రభుత్వం అందజేస్తున్న మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతుందా అని ప్రశ్నించారు. విద్యార్థులను పలు విషయ పరిజ్ఞానానికి సంబంధించిన ప్రశ్నలను అడిగారు.ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు.

అనంతరం ఉపాధ్యాయుల రిజిస్ట్రార్ ను పరిశీలించి. వారితో ముఖాముఖి మాట్లాడారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారా? వార్డెన్ల పర్యవేక్షణ ఎలా ఉంది? విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమైనా ఉన్నాయా? ఎలాంటి సౌకర్యాలు కల్పించాలనే అంశాలపై చర్చించారు.విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందేలా చూడటంతోపాటు వసతి గృహాల్లో సౌకర్యాలను మెరుగుపరిచి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో పేద విద్యార్థులే వసతి పొందుతున్నారు. అందులో రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాల నుంచి వచ్చినవారే అధికంగా ఉంటున్నారు.వీరందరికీ హాస్టళ్ల లో నాణ్యమైన భోజనంతో పాటు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే కల్పిస్తున్న వసతులను తనిఖీచేసేందుకు విద్యార్థులతో కలసి వసతి గృహంలో బస చేశాను. విద్యార్థులతో ఇంటరాక్ట్ అయ్యాను. బేసిక్ ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేకపోయారు.మన విద్యా విధానం, బోధన పద్ధతులు మార్చాల్సిన అవసరం ఉంది. నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి వివరించారు.

# ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టడానికే కేంద్రం బిల్లు

## అసెంబ్లీలో పిసిఘోష్ నివేదికపై చర్చిస్తాం, ఆ తరువాత కోర్టుకు వెళ్లు కెసిఆర్: షబ్బీర్‌అలీ



**హైదరాబాద్,ఆగస్టు 21(జర్నలిస్ట్‌ఫైల్):** ప్రతి పక్షాలను ఇబ్బందులు పెట్టడానికే జైలుకు వెళ్లిన ముఖ్యమంత్రులను తప్పించాలని కేంద్రం బిల్లు పెడుతుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలి ఆరోపించారు. గాంధీభవన్‌లో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి విన్న పాలు స్వీకరించి అనంతరం విలేఖరులతో మాట్లాడారు. ఈసందర్భంగా ప్రభుత్వ సలహా దారు షబ్బీర్ అలీ మాట్లా డుతూ కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ ఇంకా పబ్లిక్ లో పెట్టక ముందే కెసిఆర్ కోర్టుకు పోతుండు అంటేనే కెసిఆర్ తప్పిదాలు ఉన్నట్లే భావించాలని ప్రజలకు తెలిపారు. కమిషన్ పై అసెంబ్లీలో బిల్లు పెట్టి చర్చి స్తామని తర్వాత కెసిఆర్‌ను ఎక్కడికైనా పొమ్మను కాళేశ్వరం పై జస్టిస్ గోష్ 15 నెలలు విచారణ చేశారు. అందులో అన్ని తప్పులు ఉన్నట్లు గోష్ కమిటీ చెప్పిందని ఆయన వివరించారు 60 సంవత్సరాల నుండి వర్గీకరణకోసం పోరాటం చేస్తున్న మాదిగల కోసం శమీమ్ అక్తర్ తో కమిషన్ వేసి వర్గీకరణ చేసినం ఎవరి వాటా వారికి కల్పించినం అని ఆయన చెప్పారు. క్యాస్ట్ సెన్సు చేయడం తో 46.25 శాతం రాష్ట్రంలో బిసిలు ఉన్నారని తేలిందని ఆయన చెప్పారు. రాహుల్ గాంధీ ఆలోచనలు రాష్ట్రంలో సిఎం రేవంత్ రెడ్డి క్యాస్ట్ సెన్సు చేశారని ఆయన అన్నారు. అన్ని రాష్ట్రాలు కూడా తెలంగాణ లాగ కులగణన చేయాలని అడుగుతున్నారని చెప్పారు. బిసి రిజర్వేషన్ లో ముస్లిం లను తీసివేస్తే సపోర్ట్ చేస్తాం అని బిజెపి అంటుందని,గుజరాత్ లో ఉంది అన్ని రాష్ట్రాలలో ఉందిదమ్ముంటే బిజెపి రాష్ట్రాలలో ముస్లిం ల రిజర్వేషన్ తీసివేయండని సవాల్ విసిరారు. మీ బిజెపి పార్టీ జాతీయ పార్టినా కదా?మత పరమైన రిజర్వేషన్ అని బిజెపి నేతలు అంటున్నారు అని ఆయన అన్నారు.స్వాతంత్రం రాకముందు నుండే ముస్లింలకు రిజర్వేషన్ ఉందని ఆయన చెప్పారు. వృత్తి పరంగానే రిజర్వేషన్ ఇస్తున్నాం మతపరంగా కాదు అని ఆయన చెప్పారు. ముస్లింలలోబీద వారు ఉన్నారు.ముస్లింలు బతకొదా అని రాజశేఖర్ రెడ్డి వచ్చాక 4శాతం ఉపాధి,ఉద్యోగాల లో రిజర్వేషన్ ఇచ్చారని ఆయన చెప్పారు. రేవంత్ రెడ్డి ఇంటి ఇంటి సర్వే చేసి ముస్లిం లు బీదవారు ఉన్నారని గుర్తించారని చెప్పారు. ముఖాముఖిలో వచ్చిన అభ్యర్థనలలో ఇందిరమ్మ ఇండ్లు కావాలని పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి అని ఆయన చెప్పారు. భూమి ఉన్న వారికి మొదటి దపా భూమి లేని వారికి రెండో దపా ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని తెలిపారు.

# నా పుస్తకం- నా కథ పేరుతో కార్యక్రమం: పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్

**హైదరాబాద్, (జర్నలిస్ట్‌ఫైల్) ఆగస్టు 21:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పఠశాస్తిని పెంపొందించడం కోసం పాఠశాల విద్య శాఖ చర్యలు ప్రారంభించింది. ఇందకు సంబంధించి సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ అయిన పాఠశాల విద్య డైరక్టర్ నవీన్ నికోలస్ బుధవారం తన కార్యాలయంలో ఇందుకు సంబంధించి రూపొందించిన రీడింగ్ క్యాంపెయిన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్య జాయింట్ డైరక్టర్(జెడి-బోధన)రాజీవ్, రూమ్ టు రీడ్ రాష్ట్ర లీడ్ నరసింహాచారి పాల్గొన్నారు. తెలంగాణలో అక్షరాస్యతను బలోపేతం చేయడానికి రీడింగ్ క్యాంపెయిన్ ప్రారంభించాలని భావించిన పాఠశాల విద్య శాఖ అధికారులు రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్ట్ సహకారంతో రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల్లో పఠనాశక్తిని చదవడం అనే నైపుణ్యాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో "నా పుస్తకం-నా కథ" అనే థీమ్ తో. రీడింగ్ క్యాంపెయిన్‌ను అధికారికంగా ప్రారంభించింది. ఈ ప్రచారాన్ని బుధవారం రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయంలో ప్రారంభించారు.

రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సిఈఆర్‌టి) భాగస్వామ్యంతో నిర్వ హించిన లైబ్రరీ పాయింట్ ఉపాధ్యాయుల రాష్ట్ర వ్యాప్త శిక్షణతో సహా పాఠశాల విద్యాశాఖ చేపట్టిన ప్రయత్నాలకు కొనసాగింపుగా ఈ ప్రచారాన్ని ప్రారంభించడం జరిగిందని డైరక్టర్ తెలిపారు.

# ఉత్తమ అధికారి విక్టర్ బాబు కు సన్మానం



గన్నవరం, ఆగస్టు 21(జర్నలిస్ట్‌ఫైల్):

కృష్ణా జిల్లా, గన్నవరం మండలం గన్నవరం, పట్టణానికి చెందిన ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్ బాబు తాజాగా స్వాతంత్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర మంత్రివర్యులు కొల్లు రవీంద్ర చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని పొందారు. ఈ నేపథ్యంలో గన్నవరం ఎం.ఈ.ఎఫ్ నాయకులు మరియు సర్పంచ్ నిడమర్తి సౌజన్య నాగేశ్వరరావు దంపతులు సంయుక్త ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ఆవరణలో బుధవారం సాయంత్రం విక్టర్ బాబు కు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు పాల్గొని శాలువాలు పూలమాలలతో ఘనంగా సత్కరించారు అనంతరం మాణిక్యాలరావు మాట్లాడుతూ గన్నవరం ప్రాంతానికి చెందిన విక్టర్ బాబు కు మూడోవ సారి బెస్ట్ సర్వీసెస్ అవార్డ్ అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో జిల్లాల్లో నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు అనేక ప్రభుత్వేతర సంస్థలతో సయోధ్య కుదుర్చుకుని జాబ్ మేళాలు నిర్వహిస్తూ అనేక మంది నిరుద్యోగులకు విశేష సేవలు అందిస్తున్నారు అని కొనియాడారు. అదే విధంగా సర్పంచ్ నిడమర్తి సౌజన్య నాగేశ్వరరావు మాట్లాడుతూ విక్టర్ బాబు అటు వృత్తిపరమైన అంశాల్లోనే గాక ఇటు సామాజిక అంశాల్లో కూడా వేగంగా స్పందిస్తూ సేవలు అందిస్తూ విశేష కృషి చేస్తారని ఆమె అన్నారు. అనంతరం పలువురు ప్రముఖులు విక్టర్ బాబు కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.ఈ.ఎఫ్ నియోజక ఇన్చార్జి ఏసుబాబు, బీజేపీ నాయకులు నిడమర్తి నాగేశ్వరరావు, బొకినాల కోటేశ్వరరావు, పాలిటెక్నిక్ కళాశాలలో వైస్ ప్రిన్సిపల్ వి. ఎలీషా, పీ.డీ. వెంకటేశ్వరరావు, రాబర్ట్ జాన్సన్, లాం కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# నిరంతర శ్రమే వ్యాపార సూత్రం

## ప్రముఖ వ్యాపారవేత్త టి.హేమవతి రాజ్యలక్ష్మి

విజయవాడ పశ్చిమ, ఆగస్టు 21(జర్నలిస్ట్‌ఫైల్):



నిరంతర శ్రమ, సమయపాలన, నిబద్ధత, అంకితభావం వ్యాపారంలో విజయానికి కీలకసూత్రాలని ప్రముఖ వ్యాపారవేత్త టి.హేమవతి రాజ్యలక్ష్మి అన్నారు. కెబిఎన్ కళాశాల పిజి డిపార్ట్మెంట్ ఆఫ్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో ఎం.బి.ఎ విద్యార్థులకు బుధవారం 'మీట్ ద సీఈఓ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టి. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ యుక్తితో కూడిన పని లక్షణాలను అలవాటు చేసుకోవాలని సూచించారు. వినియోగదారుల శ్రేయస్సు వ్యాపార విస్తరణ, అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. సమాజ అవసరాలను గుర్తించటం, వినియోగదారుల సంతృప్తి, వ్యవస్థలను సులభతరం చేయటం ద్వారా వినియోగదారులకు అనేక సేవల్ని అందుబాటులోకి తీసుకురావటం, సాంకేతిక నైపుణ్యాల వినియోగం వంటి అంశాలను వ్యాపారస్తులు ప్రతి క్షణం గుర్తుపెట్టుకోవాలన్నారు. కష్టాలు, నష్టాలు లేని వ్యాపారం ఉండదని, కష్టాల్ని ఎదుర్కొనే ధైర్యం లేక చాలామంది యువత ప్రారంభించిన వ్యాపారాన్ని కొద్ది కాలానికే ఆపివేయటం, తీవ్రమైన నష్టాల పాలు కావటం జరుగుతోందన్నారు. అనంతరం విద్యార్థులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు రాజ్యలక్ష్మి ఉదాహరణతో కూడిన వివరణాత్మక సమాధానాలు ఇచ్చారు. పిజి కోర్సెస్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వేంకటేష్, మేనేజ్మెంట్ విభాగాధిపతి రవికిరణ్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, పి.ఎల్.రమేష్ పాల్గొన్నారు. ఎంబిఏ అధ్యాపకురాలు స్వప్న కార్యక్రమాన్ని నిర్వహించారు.

# సహకార సంఘాలలో ఎరువుల అమ్మకాలను పరిశీలించిన వ్యవసాయాధికారి



ఆగిరిపల్లి, ఆగస్టు 21(జర్నలిస్ట్‌ఫైల్):

బుధవారం మండల వ్యవసాయాధికారి నరసింగపాలెం, కృష్ణవరం, అడవినెక్కలం, ఈదర ప్రాధమిక వ్యవసాయ సహకార పరపతి సంఘములలో (పి ఎ సి ఎస్) ఎరువుల అమ్మకాలను రికార్డుల నిర్వహణ పరిశీలించారు. ఎరువుల అమ్మకాలు గురించి సహకార సంఘాల కార్యదర్సులకు పలు సూచనలు చేస్తూ రైతులందరికీ బయో మెట్రిక్ విధానంలోనే ఎరువులను విక్రయించాలని తెలిపారు. యూరియా అమ్మకంలో ఆగిరిపల్లి మండలము లో రైతులకు మొదటి ప్రాధాన్యము గా విక్రయించాలని తెలియచేసారు. యూరియా అమ్మకాలు జరిపేటప్పుడు యూరియా తో ఎటువంటి ఉత్పత్తులను ముడిపెట్టి అమ్మరాదని తెలియ చేసారు. రైతులందరూ తాము కొనుగోలు చేసిన ఎరువులకు తప్పనిసరిగా బిల్లులు పొందాలని తెలియచేసారు. యూరియాను రైతులకు విస్తీర్ణము బట్టి అమ్మకాలు జరపాలని సహకార సంఘాల కార్యదర్సులకు దిశా నిర్దేశము చేశారు. ఈ కార్యక్రమములో మండల వ్యవసాయాధికారి జె. భవాని సహకార సంఘముల కార్యదర్శులు గ్రామ వ్యవసాయ సహాయకులు బి. శివాజీ పాల్గొన్నారు.



# నందిగామలో ఘనంగా బ్రహ్మాణ సంక్షేమ దినోత్సవం

- సిఎం చంద్రబాబుకు,మంత్రి లోకేష్ కు కృతజ్ఞతలు తెలిపిన బ్రాహ్మణ సంఘ నాయకులు
- చైర్మన్ అనంద్ సూర్య జన్మదిన వేడుకలు

నందిగామ, ఆగస్టు 21(జర్నలిస్ట్‌ఫైల్):











ఎన్నికల ముందు బ్రహ్మణులకు ఇచ్చిన హామీలను నేర్చినందుకు సిఎం చంద్రబాబు కు,మంత్రి నారా లోకేష్ కు సంఘ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. 2014 వస్తున్న మీకోసం పాదయాత్రలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మరియు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కి, సీనియర్ తెలుగుదేశం పార్టీ నేతలు వేమూరి ఆనంద్ సూర్య నేతృత్వంలో అనేక మంది బ్రాహ్మణులు వారికి మద్దతుగా ఉన్న సమయం లో రేపు రాబోయే మన ప్రభుత్వంలో మీకు ఏమి కావాలి అని అడిగితే ఆనంద్ సూర్య పేద బ్రాహ్మణ సంక్షేమం కొరకు కార్పొరేషన్ ను ఏర్పాటు చేయమని కోరగా, దానికి అంగీక రించిన చంద్రబాబు నాయుడు అనంతరం వారి మానస పుత్రికగా ఆనంద్ సూర్య వ్యవస్థాపక అధ్యక్షుడిగా రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన ను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రభుత్వం ఏర్పాటు కాగానే ఆగస్టు 20వ తేదీన బ్రాహ్మణ కార్పొరేషన్ ను ఏర్పాటు చేసి దానికి బడ్జెట్ను కేటాయించడం జరిగింది. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ గా వేమూరి ఆనంద్ సూర్య చంద్ర బాబు నాయుడు సూచనల మేరకు ప్రతి పేద బ్రాహ్మణ కుటుంబానికి సంక్షేమం అందేలాగా కృషి చేశారు. ఆనాటి నుండి ప్రతి సంవత్సరం ఆగస్టు 20 తేదీన బ్రాహ్మణ సంక్షేమ దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా జరుగుతున్నది. జగన్ ప్రభుత్వంలో కార్పొరేషన్ నిర్వీర్యం అయిపోయినది, 2024 ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కార్పొరేషన్ ను పునరుద్ధరి స్తామని అలాగే యువగళం పాదయాత్రలో యువ నాయకులు మరియు విద్య మరియు ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ బాబు బ్రాహ్మణులకు తగు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం, బ్రాహ్మణ కార్పొరేషన్ కు సంక్షేమ దినోత్సవానికి ముందే చైర్మన్ ను ఏర్పాటు చేసి మరల బ్రాహ్మణ పక్షపాతి మరియు బ్రాహ్మణ హితైషి అని నిరూపించుకున్నారు. సంక్షేమ దినోత్సవం రోజు అయిన ఈరోజును, అలాగే తెలుగు దేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మరియు బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేమూరి ఆనంద్ సూర్య జన్మదినాన్ని పురస్కరించుకొని విశాఖపట్నం, ఒంగోలు, తెనాలి, గుంటూరు, నందిగామ తదితర ప్రాంతాలు మరియు రాష్ట్రవ్యాప్తంగా బ్రాహ్మణులు పలు దేవాలయా ల్లో విశేష పూజలు నిర్వహించారు. అలాగే రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన కేంద్ర కార్యాలయం విజయవాడ, సత్యనారాయణ పురం బ్రహ్మయ్య పంతులు వీధిలో చంద్రబాబు నాయుడు చిత్రపటానికి కృతజ్ఞతలుగా పాలాభిషేకం నిర్వహించి జయ జయ హర్షద్వానాలు చేశారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ గార్లపా టి విజయకుమార్, జాతీయ మహిళా అధ్యక్షురాలు కొంపెల్ల కృష్ణకుమారి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మంచికంటి ధనలక్ష్మి, జాతీయ మహిళా కార్యదర్శి రాచూరి విజయ లక్ష్మి, జనరల్ సెక్రటరీ వారణాశి దుర్గా సారధి, బి వి ఎస్ శర్మ, బి వి రమణమూర్తి, అందుకురి శ్రీమన్నారాయణ, ప్రకాష్ నందిరాజు, కాశీనాధుని సుధాకర్ పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



మైలవరం, ఆగస్టు 21(జర్నలిస్ట్‌ఫైల్):

మాజి ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ 81 వ జయంతి పురస్కరించుకొని, మైలవరం లోని స్థానిక బోసుబొమ్మ సెంటరులో మైలవరం బ్లాక్ అధ్యక్షులు, దోసపాటి గిరిధర్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి, ఘన ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఐటీ విప్లవానికి నాంది పలికిన మొట్ట మొదటి నాయకుడు, ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు దేశ ప్రగతి పథంలో నడిపించుటకు ఎంతో కృషి చేసిన మహోన్నత నాయుకుడుగా కొనియాడారు, ఈ కార్యక్రమంలో దోసపాటి గిరిధర్ కుమార్ బ్లాక్ అధ్యక్షులు ( మైలవరం), పిట్టల నాగేశ్వరరావు మండల పార్టీ అద్యక్షులు, అన్నవరపు దుర్గారావు పట్టణ అధ్యక్షులు, మననం సుధాకర్ నియోజక వర్గ B-C cell అధ్యక్షులు, శీలం రామకృష్ణ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు, కొత్త గుండ్ల ఆంజనేయులు మండల పార్టీ ఉపాధ్యక్షులు, సీనియర్ కాంగ్రెసు నాయకులు బండి చంటి (పొందుగల) అడ్డ గిరి ముసలయ్య శీలం వెంకటరెడ్డి మరియు పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణపై చర్చ





## పొల్యూషన్ కంట్రోల్ బోర్డు డైరెక్టర్ పంచకర్ల సందీప్‌ను కలిసిన జనసేన పార్టీ నాయకులు తిరుపతి అనూష సురేష్

విజయవాడ, ఆగస్టు 21(జర్నలిస్ట్‌ఫైల్):

పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ అంశాలపై అవగాహన కల్పిస్తూ, భవిష్యత్తు తరాలకు శుభ్రమైన వాతావరణాన్ని అందించాలనే ఉద్దేశంతో జనసేన పార్టీ నాయకులు ముందడుగు వేస్తున్నారు. ఈ క్రమంలో స్థానిక పశ్చిమ నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు అనూష, సురేష్‌లు ఇటీవల పొల్యూషన్ కంట్రోల్ బోర్డు డైరెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన పంచకర్ల సందీప్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో ప్రాంతీయ పరిశ్రమలు, పట్టణాల్లో పెరుగుతున్న కాలుష్యం, వృక్ష సంరక్షణ, గాలి నాణ్యత, నీటి కాలుష్యం, పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాల నియంత్రణ వంటి అంశాలపై చర్చించారు. పంచకర్ల సందీప్ పర్యావరణ పరిరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు. కాలుష్యాన్ని నియంత్రించడం కోసం కఠినమైన చట్టాలు, సాంకేతిక పద్ధతులు అమలు చేస్తున్నామని, ప్రతి ఒక్కరూ అవగాహనతో ముందుకు వస్తేనే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. జనసేన నాయకులు తిరుపతి అనూష మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రజల్లో పర్యావరణ స్నేహపూర్వక చర్యలపై చైతన్యం పెంచేందుకు పార్టీ తరఫున ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. కాలుష్య నియంత్రణ కోసం పరిశ్రమలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, చిన్న చిన్న స్థాయిలోనైనా చెట్ల నాటడం, వ్యర్థాల సక్రమ నిర్వహణ వంటి పనులు సమాజానికి ఉపకరిస్తాన్నారు. ఈ సందర్భంగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేస్తే మాత్రమే కాలుష్య సమస్యకు పూర్తి పరిష్కారం దొరుకుతుందని జనసేన నేతలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పశ్చిమ నియోజకవర్గం ఐటీ కోఆర్డినేటర్ మంతాపురం రాజేష్, తిరునగిరి మురళీకృష్ణ, ఎండి ఆయాజ్, ఎస్‌కే ఆలీ, సూరిబాబు, మార్కండేయులు, ముద్దాడ సూరిబాబు, కోడెబోయిన చందు, వెంకటరమణ, శ్యాంసుందర్, భాగ్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌లో అత్యంత క్రెడిట్ హెల్తీ నగరంగా ఢిల్లీ

- తర్వాత స్థానాలలో పూణే, కేరళ, చండీగఢ్
- ఢిల్లీలో సగటు క్రెడిట్ స్కోర్ 746
- 46 శాతంతో దేశంలోనే అత్యధికం

paisabazaar.com
HAR SAPNA HOGA SACH

హైదరాబాద్, ఆగస్టు 21(జర్నలిస్ట్‌ఫైల్):

భారతదేశంలో అత్యంత క్రెడిట్ హెల్తీ నగరంగా ఢిల్లీ అవతరించింది. ఈ నగరంలో 46 శాతం మంది క్రెడిట్ హెల్తీగా ఉన్నారు. సగటు క్రెడిట్ స్కోర్ 746.. ఇది దేశంలోనే అత్యధిక రికార్డు. రెండో స్థానంలో పుణే నిలిచింది. అక్కడ 44 శాతం మంది వినియోగదారుల సగటు క్రెడిట్ స్కోర్ 744గా ఉంది. కేరళలో 43 శాతం మంది వినియోగదారుల సగటు స్కోర్ 745గా ఉంది. చండీగఢ్‌లో 43 శాతం మంది వినియోగదారుల సగటు స్కోర్ 744గా నమోదైంది. పైసాబజార్ విడుదల చేసిన 'హౌ ఇండియా చెక్డ్ క్రెడిట్ స్కోర్' నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. ఈ సందర్భంగా పైసాబజార్ సీఈఓ సంతోష్ అగర్వాల్ మాట్లాడుతూ పైసాబజార్ నిర్వహించిన 'క్రెడిట్ ప్రీమియర్ లీగ్ (సీపీఎల్)' తొలి ఎడిషన్‌లో పాల్గొన్న వారిపై ఆధారపడి రూపొందిం చామని తెలిపారు. దేశవ్యాప్తంగా క్రెడిట్ అవగాహన పెంపొందించేందుకు రూపొందించిన ఈ ఆన్‌లైన్ గేమిఫైడ్ దేశంలో అత్యధిక క్రెడిట్ స్కోర్ కలిగిన వినియోగదారులను గుర్తించడం, 710 నగరాల మధ్య అత్యంత క్రెడిట్ హెల్తీ నగరాన్ని ఎంపిక చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. ఈ అధ్యయ నంలో 710 నగరాల నుంచి 47 లక్షల మందికి పైగా క్రెడిట్ స్కోర్ డేటాను 30 రోజుల పాటు సేకరించామన్నారు. ఈ పోటీలో నమోదైన అత్యధిక క్రెడిట్ స్కోర్ 900లో 861.. దేశవ్యాప్తంగా ఐదుగురు ప్రత్యేకంగా పాల్గొన్న వారు సాధించారన్నారు. ఇది వివిధ నేపథ్యాలు, ప్రొఫైల్స్ ఉన్న వారిలోనూ అత్యుత్తమ క్రెడిట్ హెల్త్ సాధ్యమేనని సూచించిందన్నారు. ఈ ఐదుగురు విజేతలు బెంగళూరు, జైపూర్, లక్నో, కేరళ, పుణే నుంచి వచ్చారన్నారు. రెండో అత్యధిక స్కోర్ 859ను ఒక చెన్నై అభ్యర్థి నమోదు చేశారన్నారు. పైసాబజార్‌లో మా నిరంతర ప్రయత్నం క్రెడిట్ అవగాహనను భారత్ ప్రతీ మూలకు తీసుకెళ్లడమే నన్నారు. కేవలం కొద్ది సమయంలోనే లక్షలాది మంది తమ స్కోర్‌ను ట్రాక్ చేయడానికి, అర్థం చేసుకోవడానికి, మెరుగుపరచడానికి ముందుకు వచ్చారన్నారు. ఇకముందు కూడా కొత్త ఆవిష్కరణలతో క్రెడిట్ అవగాహనను మరింత ఆసక్తికరంగా మార్చి, ఆర్థిక ఆరోగ్యం గురించి చర్చలు ప్రధాన ప్రవాహంలోకి రావడానికి కృషి చేస్తామన్నారు. ఈ అధ్యయనంలో ముంబై, హైదరాబాద్, లక్నో సీపీఎల్లో అత్యంత చురుకైన నగరాలుగా నిలిచాయన్నారు. ఈ మూడు నగరాల నుంచే 15 లక్షల మందికి పైగా పాల్గొన్నా రన్నారు. 50 శాతం మందికి పైగా మిల్లెనియల్ వయసు (29–44 సంవత్సరాలు)కు చెందినవారన్నారు. మహిళలు ఎనిమిది శాతంగా ఉన్నా.. వారిలో దాదాపు మూడు వంతులు దక్షిణ భారత నగరాల నుంచి వచ్చారన్నారు. ఇందులో చెన్నై, హైదరాబాద్, బెంగళూరు ముందంజలో ఉన్నాయన్నారు. సీపీఎల్ లో అత్యంత ఆకర్షణీయమైన అంశాలలో 'జిబ్లీ-స్టైల్ సెల్ఫీ ఫీచర్' ఒకటన్నారు. ఇది వినియోగదారులు తమ క్రెడిట్ స్కోర్‌తో కూడిన యానిమేటెడ్ సెల్ఫీ సృష్టించి సోషల్ మీడియాలో పంచుకునేలా చేసిందన్నారు.

# మంత్రి ఫరూక్‌తో వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ భేటీ

- వక్ఫ్ ఆస్తులు ముస్లిం సమాజ ప్రయోజనానికి ఉపయోగపడే విధంగా చర్యలు
- వక్ఫ్ బోర్డ్ అభివృద్ధి, ఆస్తుల పరిరక్షణ, ముస్లిం ల సంక్షేమం పై చర్చ
- రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ల ఏర్పాటుపై విస్తృత చర్చ



**అమరావతి, ఆగస్టు 21(జర్నలిస్ట్‌ఫైల్):**

రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి నశ్యం మొహమ్మద్ ఫరూక్ ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ తాడేపల్లి లోని మంత్రి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిరువురూ వక్ఫ్ బోర్డ్ అభివృద్ధి, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, ముస్లిం లకు సంక్షేమ కార్యక్రమాలపై సవివరంగా చర్చించారు. వక్ఫ్ ఆస్తులు ముస్లిం ల సమాజ భవిష్యత్తుకు మూలస్తంభాలని అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. వక్ఫ్ ఆస్తులు ముస్లిం సమాజ ప్రయోజనానికి ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముస్లిం మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా రాష్ట్రవ్యాప్తంగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ల ఏర్పాటు ప్రణాళికపై విస్తృతంగా చర్చించారు. మహిళలకు వృత్తి ఆధారిత శిక్షణ ఇవ్వడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అబ్దుల్ అజీజ్ తెలిపారు. ముస్లిం విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా, నూతన విద్య పథకాన్ని తీసుకువచ్చి వారిలో సమర్థత ను పెంచాలని సూచించారు. అన్నిటికి సానుకూలంగా స్పందించిన మంత్రి ఫరూక్ వక్ఫ్ బోర్డ్ అభివృద్ధి కోసం, ముస్లిం ల సంక్షేమం కోసం అన్ని విధాల సహకారం అందిస్తామని తెలిపారు. వక్ఫ్ బోర్డ్ భవిష్యత్తు, మైనారిటీల కు విద్యా ఉపాధి రంగాల్లో అవకాశాలు సృష్టించే దిశగా ముందుకు సాగుదామని భరోసా కల్పించారు.

# వినాయక ఉత్సవ మండపలకు సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు

## డీజీపీ హరీష్ కుమార్ గుప్తా



**అమరావతి, ఆగస్ట్ 21(జర్నలిస్ట్‌ఫైల్):**

రానున్న వినాయక చవితి పండుగను దృష్టిలో పెట్టుకుని, వినాయక ఉత్సవ మండప నిర్వాహకులు సింగిల్ విండో విధానం ద్వారా, ఆన్ లైన్లో అనుమతులు పొందడానికి వీలుగా ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ రూపొందించిన ganeshutsav.net వెబ్ సైట్ ను రాష్ట్రవ్యాప్తంగా అందుబాటు లోకి తీసుకురావడం జరిగిందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. వినాయక ఉత్సవ మండప నిర్వాహకులు ఆన్ లైన్లో తమ, తమ వివరాలను నమోదు చేసుకుని ఎన్ ఓ సి (నిరభ్యంతర పత్రం) పొందవచ్చని తెలిపారు. మండప నిర్వాహకులు అనుమతులు కోసం ఆన్ లైన్లో దరఖాస్తు చేసుకున్న వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ ముఖ్యాధికారి మండపాలు ఏర్పాటు చేసే ప్రాంతాలను పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా ఉన్న వినాయక ఉత్సవ మండపాలకు క్యూఆర్ తో కూడినా ఎన్ ఓ సి (నిరభ్యంతర పత్రం) జారీ చేస్తారని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో ఏర్పాటు చేసే వినాయక ఉత్సవ మండపాలకు మాత్రమే ఈ అనుమతులు అవసరం అని డీజీపీ స్పష్టం చేశారు. ఈ సేవలు పూర్తిగా ఉచితమని ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ప్రజలు వినాయక నవరాత్రి ఉత్సవాలను సురక్షితంగా, ఆనందంగా జరపుకునేందుకు, మండప నిర్వాహకులు పూర్తి పారదర్శకంగా, సులభతరంగా పోలీసు శాఖ అనుమతులు పొందేందుకు ఈ ఆన్ లైన్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. నిర్వాహకులు ganeshutsav.net వెబ్ సైట్ ద్వారా అనుమతులు పొందవలసిందిగా డీజీపీ హరీష్ కుమార్ గుప్తా కోరారు.

# ఆరేళ్లుగా ఆగిపోయిన ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతలకు ప్రభుత్వం మోక్షం కల్పించాలి

## ఏపిపిటిడి(ఆర్టీసి)ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్రఅధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు

**అమరావతి, ఆగస్టు 21(జర్నలిస్ట్‌ఫైల్):**

ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతలకు ఆరేళ్లుగా వివిధ కారణాలుతో ప్రభుత్వం జాప్యం చేస్తూనే ఉంది.అయితే ఆర్టీసీ అధికారులు పదోన్నతుల ఫైళ్ళను ప్రభుత్వానికి పంపుతున్నా, ప్రభుత్వం మళ్లీ వాటిని వెనక్కి పంపడం జరుగుతోంది. దీంతో ఆర్టిసి ఉద్యోగుల పదోన్నతులకు ఇప్పటివరకు మోక్షం దొరకలేదు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి పదోన్నతలకు మోక్షం కల్పించాలని ఏపిపిటిడి(ఆర్టిసి)ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్రఅధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వీ.నరసయ్య మంగళవారం ఒక ప్రకటన ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "గత నెల 31న ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులపై ఫైల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వద్దకు వెల్లినా, ఇంతవరకు పైలు అక్కడనుండి కదల కుండా అక్కడే ఆగిపోయింది. ఆర్టీసి ఉద్యోగుల ఆవేదనను ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు అర్థం చేసుకోవాలి. పదోన్నతుల కోసం ఎదురుచూస్తూనే ఈ ఆరేళ్లలో సుమారు 2000 మంది ఉద్యోగులు రిటైర్ కావడం విచారకరం అని" అన్నారు. పదోన్నతులకు అనుమతులు ఇస్తే ఆర్టీసిలో అధికారులు నుండి క్లాస్‌ఫ్లోర్ ఉద్యోగుల వరకు సుమారు 3000 మందికి పదోన్నతులు లభిస్తాయని అన్నారు. ప్రభుత్వానికి కూడా మంచి పేరు వస్తుందని, ముఖ్యమంత్రి స్త్రీశక్తి పథకం ప్రారంభానికి వచ్చిన సందర్భంగా ఈ పదోన్నతలు పై ఇ.యు రాష్ట్రకమిటీ తరపున లేఖను కూడా ఇవ్వడం జరిగిందని అన్నారు. ముఖ్యమంత్రి, రవాణా మంత్రి స్వయంగా చొరవ తీసుకొని ఆర్టీసి ఉద్యోగుల పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి ఉద్యోగులలో ఉన్న అసంతృప్తిని తగ్గించాలని ఇ.యు నాయకులు విజ్ఞప్తి చేశారు.

# ఆలోచన నుంచి ఆవిష్కరణ వరకు..





- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో స్టార్టప్‌లకు సరికొత్త ఊపు
- మేధస్సును ప్రోత్సహించి చేయిపట్టి నడిపించేందుకు వినూత్న ప్రణాళికలు
- పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత స్థాయిలో వర్క్ షాపులు
- యువతలో సమస్య పరిష్కార నైపుణ్యాలకు ఊతం
- అరుదైన అవకాశమిది.. సద్వినియోగం చేసుకోవాలి
- ఆర్‌టీఐహెచ్ స్పోక్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, ఆగస్టు 21(జర్నలిస్ట్‌ఫైల్):**

ఓ చిన్న ఆలోచన సరికొత్త ఆవిష్కరణకు ఆపై విజయవంతమైన పరిశ్రమ స్థాపనకు కారణమవుతుందని.. రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్)తో స్టార్టప్‌లకు సరికొత్త ఊపు వస్తుందని.. ఈ వినూత్న వ్యవస్థను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. మంగళగిరిలోని మయూరి టెక్ పార్క్‌లో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా విజయవాడ ఎనికేపాడులోని ఆర్‌టీఐహెచ్ స్పోక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎనికేపాడు ఆర్‌టీఐహెచ్ స్పోక్ కార్యాలయం నుంచి కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ.. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు వంశీ ఆదిత్య (మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్), విట్ - అమరావతి డైరెక్టర్ జి.సోమశేఖర్, కె.రాజశేఖర్ (సీఈవో, హ్యాచ్‌ల్యాబ్ రీసెర్చ్ సెంటర్ ఆఫ్ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, ఏపీ), కె.లలిత ప్రసాద్ (సీఎఫ్‌వో, మోహన్ స్పింటెక్స్ ఇండియా లిమిటెడ్), ఔత్సాహక పారిశ్రామికవేత్తలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతికతలకు, కొత్త ఆవిష్కరణలకు రాష్ట్రాన్ని వేదికగా తీర్చిదిద్దేందుకు అమరావతిలో రతన్‌టాటా ఇన్నొవేషన్ హబ్‌ను గౌరవ ముఖ్యమంత్రి ప్రారంభించారని.. దీనికి అనుసంధానంగా విజయవాడతో పాటు మొత్తం అయిదు ప్రాంతాల్లో స్పోక్స్‌లను ప్రారంభించినట్లు వివరించారు. పరిశ్రమల స్థాపనకు కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే వారికి అవసరమైన సహాయ సహకారాలు ఈ స్పోక్ ద్వారా అందించడం జరుగుతుందని.. పరిశ్రమలతో అనుసంధానించడంతో పాటు అవసరం మేరకు నైపుణ్య శిక్షణ, పెట్టుబడి వనరులు, మార్కెటింగ్ వ్యూహాలు ఇలా వివిధ అంశాల్లో మద్దతుగా నిలుస్తుందన్నారు. ఆలోచన అనేది ఎంత ఇన్నొవేటివ్‌గా ఉంటే వచ్చే ప్రొడక్ట్ కూడా అంతే ఇన్నొవేటివ్‌గా ఉంటుందని.. ఒక కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలనే గొప్ప లక్ష్యాన్ని సాకారం చేయడంలో భాగంగా ప్రభుత్వం ఆర్‌టీఐహెచ్‌ను ప్రారంభించినట్లు వివరించారు. ఈ హబ్ ఓ అరుదైన అవకాశమని.. యువత సద్వినియోగం చేసుకోవాలని.. ప్రమోటర్లు, సహ ప్రమోటర్లు సహాయంతో స్పోక్‌ను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషిచేయనున్నట్లు లక్ష్మీశ పేర్కొన్నారు.

### దేశంలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి : 20సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ దినకర్..

ఆవిష్కరణల ఆధారిత ఆర్థిక వ్యవస్థ నిర్మాణంతో పాటు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ దేశంలో అగ్రగామిగా నిలిపేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు కృషిచేస్తున్నారని ఇందులో భాగంగా నేడు ఆర్‌టీఐహెచ్‌ను ప్రారంభించినట్లు 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ అన్నారు. కామన్ వర్క్ ప్లేస్‌తో పాటు ఓ స్టార్టప్ స్వయం సమృద్ధి సాధించి ఆయా రంగాల్లో మంచి పారిశ్రామికవేత్తగా నిలదొక్కుకునేందుకు ఈ హబ్ చేయూతనందిస్తున్నారు. ఆధునిక శాస్త్రసాంకేతిక రంగాల్లోనూ నైపుణ్య శిక్షణ, మార్కెట్లో నిలదొక్కుకునే సామర్థ్యం అందించేందుకు దోహదం చేస్తుందన్నారు. స్టార్టప్ ఇండియాతో దేశం యూనికార్న్ కంపెనీల్లో వడివడిగా ముందుకెళ్తోందని.. స్టార్టప్‌ల పరంగా రాష్ట్రం కూడా ప్రగతి పథాన పయనిస్తుందని, ఆర్‌టీఐహెచ్ వంటి వినూత్న వేదికలు యువ టాలెంట్‌ను ప్రోత్సహిస్తాయని లంకా దినకర్ పేర్కొన్నారు.

### కొత్త ఆలోచనలతో సరికొత్త ప్రాజెక్టుల రూపకల్పన : జేసీ ఎస్.ఇలక్కియ

ఔత్సాహిక యువత కొత్త ఆలోచనలతో ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తున్నారని, వీరికి అన్ని విధాలా ఆర్‌టీఐహెచ్ హబ్, స్పోక్స్‌ల ద్వారా మద్దతు లభిస్తుం దని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అన్నారు. విద్యార్థులు, యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొం దించి, సరికొత్త ఆవిష్కరణలు దిశగా నడిపించేందుకు రతన్‌టాటా ఇన్నొవేషన్ హబ్ దోహదం చేస్తుందన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన యువత ఈ స్పోక్‌ను ఉపయోగించుకోవచ్చని వివరిం చారు. అదేవిధంగా ఆర్‌టీఐహెచ్ స్పోక్ నిర్మాణం, కార్యకలాపాలను కూడా జేసీ వివరించారు. కార్యక్ర మంలో స్వార్న్ డ్రోన్స్ స్కాన్ క్యూర్, క్యూ ప్రకృతి, కిసాన్ కనెక్ట్, వా బ్రెయిన్, విన్‌స్పైర్, ది 99 కమ్యూ నిటీ, డెమోక్రిటో, బుక్ మై సర్వీస్ వంటి 22 స్టార్టప్‌లు స్టాళ్లను ఏర్పాటు చేసి, తమ సేవలను వివరించాయి. కార్యక్రమంలో విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, విజయవాడ గ్రామీణ తహసీల్దార్ బి.సుగుణ పాల్గొన్నారు.

# అనర్హులను ఏరివేసేందుకే సదరం సర్టిఫికెట్ల పున:పరిశీలన

- ఇప్పటికి లక్షమందిని అనర్హులుగా తేలారు,మరో 50వేల మంది సర్టిఫికెట్లు పున:పరిశీలనకు రాలేదు
- రాష్ట్ర ఇమేజ్ ను డ్యామేజ్ చేసే విధంగా ప్రతిపక్ష పార్టీ విషం చిమ్ముతున్నది
- రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి



**అమరావతి, ఆగస్టు 21(జర్నలిస్ట్‌ఫైల్):**

బోగస్ సదరం సర్టిఫికెట్లతో దివ్యాంగుల పింఛన్లను పొందే అనర్హులను ఏరివేసేందుకే సదరం సర్టిఫికెట్ల పున:పరిశీలన కార్యక్రమం జరుగుచున్నదని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి స్పష్టం చేశారు. గతంలో ఉన్న అర్హతలను బట్టే సర్టిఫికెట్ల పున:పరిశీలన జరుగుచున్నదని, అర్హతలను మార్చి పింఛనుదారులకు అన్యాయం చేసే విధంగా కూటమి ప్రభుత్వం ఏ మాత్రం ప్రవర్తించడం లేదని ఆయన తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం క్రింద దివ్యాంగులకు ప్రభుత్వం ఇచ్చే రూ.6,000/- ల పింఛనును గత ప్రభుత్వం హయాంలో అనర్హులకు కూడా మంజూరు చేసి దుర్వినియోగం చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో మొత్తం 7.86 లక్షల మంది దివ్యాంగ పింఛన్లను పొందడం జరుగుచున్నదని, వారిలో 5.10 లక్షల మందికి చెందిన సదరం సర్టిఫికెట్లను పున:పరిశీలించేందుకు నోటీసులు జారీచేయడం జరిగిందన్నారు. అయితే ఇప్పటి వరకూ 4.50 లక్షల మంది వారి సర్టిఫికెట్లను తనిఖీ చేయించుకోగా, వారిలో దాదాపు ఒక లక్ష మంది అనర్హులు ఉన్నట్లు గుర్తించడమైందన్నారు. అదే విధంగా మిగిలిన వారు తమ సర్టిఫికెట్లను రీవెరిపై చేయించుకొనేందుకు ముందుకు రాలేదన్నారు. వీరందరికీ మరో సారి నోటీసులు జారీ చేస్తామని, అప్పటికీ వారు ముందుకు రాకపోతే వారి పింఛన్లను నిలుపుదల చేస్తామని తెలిపారు. అయితే వైద్యులు ఎవరిని అయితే అనర్హులుగా ధృవీకరించారో వారు మరో సారి తమ అర్జీని మండల అభివృద్ధి అధికారికిగాని, మున్సిఫల్ కమిషనర్ కు గాని అందజేసినట్లతై మరో సారి వారి అర్హతను పరిశీలించడం జరుగుతుందన్నారు.

రాష్ట్రంలో అన్ని జిల్లాలో సదరం సర్టిఫికెట్ల రీవెరిఫికేషన్ జరిగిందని, అయితే అత్యధికంగా పులివెందులలోనే 1,708 మంది బోగస్ పింఛను దారులు ఉన్నట్లు గుర్తించడమైందన్నారు. అదే విధంగా మచిలీపట్నంలో 1,539 మంది, చంద్రగిరిలో 1,604 మంది బోగస్ పింఛనుదారులను గుర్తించడమైందన్నారు. అదే విదంగా అత్యల్పంగా కాకినాడలో 19 మంది, విశాఖ దక్షిణ నియోజక వర్గంలో 39 మంది మరియు తాడికొండలో 55 మంది బోగస్ పింఛనుదారులను గుర్తించడం జరిగిందన్నారు. అర్హులకు మాత్రమే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అందజేయాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా వ్యవహరిస్తుంటే, ఇటు వంటి ప్రయత్నాన్ని ప్రధాన ప్రతిపక్ష పార్టీ, ఇతర పార్టీలు ఏ విధంగా తప్పుపడతాయని ఆయన ప్రశ్నించారు. పింఛన్లను ఎదో విధంగా తొలగించాలనే ఉద్దేశ్యంతో తమ ప్రభుత్వం లేదని, దేశంలోనే అత్యధికంగా పింఛన్లు, పింఛను సొమ్ము ఇచ్చేది తమ కూటమి ప్రభుత్వం అనే విషయాన్ని రాష్ట్ర ప్రజలు అందరూ గుర్తించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం రూ.3 వేల పింఛను ఇస్తానని హామీ ఇచ్చి ఘోరంగా మోసం చేయడం జరిగిందని, అయితే తమ ప్రభుత్వం రూ.3 వేల నుండి రూ.4 వేలకు పెంచడమే కాకుండా, అధికారంలోకి వచ్చే మూడు మాసాల ముందు నుండే పెంచిన పింఛను ఎరియర్స్ ను కూడా పింఛను దారులకు చెల్లించడం జరిగిందన్నారు. దేశంలోనే అత్యధికంగా పింఛన్లను ఇస్తున్నది తమ కూటమి ప్రభుత్వం అని, దివ్యాంగులకు రూ.6 వేలు, మంచంమీద నుండి లేవలేని అంగవిక లురకు రూ.15 వేలు, దీరకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.10 వేల పింఛను తమ ప్రభుత్వం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ విధంగా తమ ప్రభుత్వం దాదాపు 65 లక్షల మంది పింఛన్లు అందజేస్తుంటే, గత ప్రభుత్వం సిక్స్ స్టెప్ వేలిడేషన్ అని, ప్యామిలీ మ్యాపింగ్ అంటూ కొన్ని లక్షల మంది పింఛన్లను రద్దు చేయడం జరిగిందన్నారు. కుటుంబ పెద్ద చనిపోతే, వారి స్థానంలో భార్యకు వితంతు పింఛనును కూడా తమ ప్రభుత్వం మంజూరు చేయడం జరుగుచున్నదన్నారు.

### రాష్ట్ర ఇమేజ్ ను డ్యామేజ్ చేసే విధంగా విషం చిమ్ముతున్నది

రాష్ట్ర ఇమేజ్ ను డ్యామేజ్ చేసే విధంగా ప్రధాన ప్రతిపక్షపార్టీ విషం చిమ్మడం ఎంతో దురదృష్టకరమన్నారు. విభజనతో ఎంతగానో నష్టపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు రాజకీయ విబేదాలను ప్రక్కనపెట్టి అన్ని రాజకీయ పార్టీలు కృషిచేయాల్సి నదిపోయి, అభివృద్ధిని అడ్డుకునే విధంగా, రాష్ట్రాన్ని నాశనం చేసే విధంగా విషం చిమ్మడం దిగజారుడు రాజకీయానికి నిదర్శనం అని ఆయన అభివర్ణించారు. రాష్ట్ర రాజధాని అమరావతి పై గత ప్రభుత్వానికి ఉన్న ద్వేషంతో ఎటు వంటి అభివృద్ధి పనులు నిర్వహించకపోవడం వల్లే నేడు రాజధాని ప్రాంతం ముంపుకు గురవ్వడానికి కారణమన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా దాదాపు 30 నుండి 50 వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉన్న రాజధాని ప్రాంతంలో బారీ వర్షాలకు కొంత ఇబ్బంది రావటం సహజమేనని, దాన్ని భూతద్దంలో చూపుతూ రాజదాని ప్రాంతం ముంపుకు గురైందని చిలవలు పలవలుగా రాద్ధాంతం చేసే విదంగా దుష్ప్రచారం చేయడం అంటే రాష్ట్రాభివృద్ధిని ప్రధాన ప్రతిపక్ష పార్టీ అడ్డుకోవడమే అని ఆయన అన్నారు. రాజధాని ప్రాంతంలో భవిష్యత్తులో జరిగే నిర్మాణాలు, కట్టడాలు ఏ మాత్రం వరద నీటికి గురవ్వకుండా ఉండేందుకు అవసరమైన వరద నీటి పారుదల వ్యవస్థలను ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ముంబాయి, హైద్రాబాదు వంటి మహా నగరాలు కూడా వరద నీటితో ముంపుకు గురవుతున్నాయని, అటు వంటిని నిర్మాణ దశలో ఉన్న అమరావతి రాజధాని ప్రాంతంలో అదిక వర్షాల వల్ల కురిసిన వరద నీరు నిల్వ ఉండటం సహమేనన్నారు.

### 4 రోజుల్లో 47 లక్షల మంది ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకున్నారు

మహిళల అభ్యున్నతిని, సంక్షేమాన్ని కాంక్షిస్తూ వారికి అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం 'స్త్రీ శక్తి' పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని అమలు చేయడం జరుగుచున్నదన్నారు. గత నాలుగుం రోజుల్లో దాదాపు 47 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకున్నారని, తద్వారా రూ.19 కోట్ల మేర ఆధాయాన్ని వారు పొందారని మంత్రి తెలిపారు. అయితే ఇటు వంటి మంచి పథకం పై కూడా విషం చిమ్మే విధంగా ప్రధాన ప్రతిపక్ష పార్టీ ప్రవర్తిస్తున్నదనే ఆవేదనను ఆయన వ్యక్తం చేశారు. కొండ ప్రాంతాల్లో భద్రత దృష్ట్యా ఉచి బస్సు ప్రయాణాన్ని తొలుత అనుమతించడలేదని, అయితే తదుపరి ఆ విషయాన్ని పున:పరిశీలించి ఇప్పుడు కొండ ప్రాంతాల్లో కూడా మహాళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అనుమతించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో అపారమైన సహజ వనరులు ఉన్నాయని, వాటికి తోడు వృత్తి నైపుణ్యం యువత కూడా పెద్ద ఎత్తున ఉందని, వీటిని సద్వినియోగం చేసుకుంటూ రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వం అహర్నిశలూ కృషి చేస్తున్నదని, ప్రతి పక్ష పార్టీలు కూడా ఈ యజ్ఞానికి సహరిస్తూ రాష్ట్రాభివృద్ధికి చేయూతను అందజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## గుంటూరులో మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్ పనులు వేగవంతం చేయాలి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లో భాగంగా గుంటూరు నగరానికి మంజూరైన ప్రతిష్టాత్మక మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఏపిఎంఎస్ఐడీసి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక మెడికల్ కాలేజీలో జరుగుతున్న యూనిట్ పనులను ఇంచార్జి ఎంహెచ్ఓ రామారావు, సిబ్బందితో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అత్యున్నత ప్రమాణాలు, నాణ్యతతో కూడిన వైద్య పరీక్షలు అందించేందుకు గుంటూరులో ఏర్పాటు చేస్తున్న ఈ యూనిట్ దేశంలోనే ముందుండే విధంగా అభివృద్ధి చెందుతోందన్నారు. యూనిట్ పనుల పురోగతిపై ఏపిఎంఎస్ఐడీసి అధికారులు ప్రతి రోజు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పనుల్లో జాప్యం జరగకుండా చూసుకోవాలని, క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## పేదల ఆరోగ్యసంరక్షణే కూటమి ప్రభుత్వ కర్తవ్యం



- **నవులూరు గ్రామంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేత**


**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** పేదల ఆరోగ్య సంరక్షణే కూటమి ప్రభుత్వం కర్తవ్యం. పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయనిధి రూపంలో నారా చంద్రబాబు నాయుడు గారు భరోసా కల్పిస్తున్నారని గ్రామ పార్టీ అధ్యక్షులు రుద్రు కోటేశ్వరరావు అన్నారు. నవులూరు గ్రామం లో ముగ్గురికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను గ్రామ పార్టీ నాయకులు లబ్ధిదారులు గరికపాటి పర్షిత శ్రీ కు రూ. 31,934, హరి లలిత ప్రత్యూష కు రూ. 68,283, మేకల పల్లవి కి రూ. 23,000 విలువగల చెక్కులను ఇళ్ళకు వెళ్ళి అందజేసారు. ఈసందర్భంగా గ్రామ పార్టీ అధ్యక్షులు రుద్రు కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు కార్పోరేట్ వైద్యం సకాలంలో అందించాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, ఆరోగ్య భరోసా కల్పించడంలో చంద్రబాబు గారి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ముందుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకట్, గుంటూరు పార్లమెంట్ టీడీపీ యస్సీ సెల్ అధ్యక్షులు వేమూరి మైనర్ బాబు,రుద్రు శ్రీనుబాబు,చిలకలపూడి శేషగిరి,బత్తుల నాగరాజు, కొల్లి వెంకటరావు, కొత్త శ్రీనివాసరావు,మర్రి ఏసుబాబు,షేక్ నజీర్,కట్టెపోగు ముత్తయ్య,వేమూరి శ్రావణ్, మట్టకొయ్య అశోక్,తోట శ్రీనివాస్,తోట సాంబ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న గోవిందమాంబ బాలికోన్నత పాఠశాల



**బ్రహ్మంగారిమఠం ,(జర్నలిస్ట్ ఫైల్) :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ గోవిందమాంబ బాలికోన్నత పాఠశాల నందు విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడాల్లో ప్రతిభ చాటుతున్నారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ స్వామిరెడ్డి తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ లోని జంప్ రోప్ పోటీలు నెల్లూరు జిల్లాలోని కావలిలో నిర్వహించడం జరిగిందని అందులో మా పాఠశాల విద్యార్థులు సి. జస్సి–గోల్డ్ సిల్వర్ మెడల్స్ మరియు బి.నాగ శ్వేత–సిల్వర్ మెడల్, పి. ఉమామహేశ్వరీ–సిల్వర్ మెడల్ సాధించినట్లు ఆయన తెలిపారు. అంతే కాకుండా ఆంధ్రప్రదేశ్ లోని 3వ లగోరి రాష్ట్రస్థాయి పోటీలు కడప జిల్లాలోని మైదుకూరులో నిర్వహించగా ఆ పోటిల్లో గోవిందమాంబ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటి రెండవ స్థానం సిల్వర్ మెడల్ సాధించడమైనదని చెప్పారు. ఆటల పోటీలకు వెళ్లేందుకు ప్రోత్సహించిన హెచ్.ఎం ఓ. లక్ష్మణ స్వామి రెడ్డి తెలుగు ఉపాధ్యాయులు ఎల్. కొండారెడ్డి పి. డి పుష్పలత విజయలక్ష్మి ఎలిజిబెత్ రాణికమాల్ బి సంధ్యారాణి కే సుమతి కే. పరిమిళ భారతి చెన్నమ్మ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించి అభినందించారు.

## చవితి మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** వినాయక చవితి పర్వదినం సందర్భంగా మండపాలు ఏర్పాటు చేసుకునే నిర్వాహకులు తప్పనిసరిగా సంబంధిత శాఖల నుంచి అనుమతులు తీసుకోవాలని మంగళగిరి గ్రామీణ. ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ సూచించారు. ఈ సందర్భంగా గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, మండపాల ఏర్పాటులో పాటించవలసిన నియమావళిని వివరించారు. గ్రామాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని పేర్కొన్నారు. తొలుత తప్పనిసరిగా సంబంధిత శాఖల అనుమతి తీసుకోవాలని అన్నారు. రాత్రి సమయంలో మండపం వద్ద నిర్వాహకులు బస చేస్తూ, పర్యవేక్షణ చేయాలని ఉదయం 9 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు మాత్రమే పూజల కోసం మైకులు వినియోగించాలని స్పష్టం చేశారు. అలాగే నిమజ్జనం సమయంలో అనుమతి ఉన్న దారిలోనే నిమజ్జన యాత్రలు జరుపుకోవాలని ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వాహకులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. “ప్రజా శాంతి భద్రతల పరిరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. నిర్వాహకులు పోలీసుల సూచనలను కచ్చితంగా పాటించాలని” విజ్ఞప్తి చేశారు.

## కొలకలూరు శివారులో దారిదోపిడి

**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్) :** మండలంలోని కొలకలూరు శివారులొ దారిదోపిడి చేసి నగదుతొ పరారైన ముగ్గురు వ్రక్తులు. బాదితుడి పిర్యాదుతొ రంగంలోకి దిగిన రూరల్ పోలీసులు. సేకరించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. గరువుపాలెంకు చెందిన సుమన్ అనే యువకుడు, మంగళగిరిలోని, ఓ కాఫీ షాపులొ పనిచేస్తుంటాడు. తన విధులు పూర్తి చేసుకుని గురువారం ద్విచక్రవాహనంపై,తన స్వగ్రామానికి వస్తున్న సురేష్ పై, కొలకలూరు శివారులోని, అనమర్లపూడి వద్ద, స్కూటీపై వచ్చిన ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు, దాడిచేసి, అతనివద్ద ఉన్న, పదివేల రూపాయలు, లాక్కుని పరారయ్యారు. బాదితుడు సురేష్ పిర్యాదుమేరకు, రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి శంకుస్థాపన

- **మొత్తం రూ .1కోటి 66లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 25వ డివిజన్ పరిధిలో సీసీ రోడ్లు, డ్రైన్లు, కల్వర్టులు వంటి పలు అభివృద్ధి పనులకు గురువారం ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి శంకుస్థాపన చేశారు. మొత్తం 4 అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసారు. వీటిలో కొత్త కాలనీ తిరుపతమ్మ తల్లి ఆలయం (CPT రోడ్) నుండి కొత్త కాలనీ 1వ లైన్ వరకు వెట్ మిక్స్ రోడ్డు ను రూ. 20 లక్షలతో నిర్మించనుండగా, దుర్గా నగర్ 3వ లైన్ వద్ద సీసీ డ్రెయిన్, ఆర్‌సీసీ కల్వర్టులను నిర్మించి స్థాపం రోడ్డుకు అనుసంధానం చేయడానికి రూ. 26 లక్షలు కేటాయించారు. అలాగే గెలాక్సీ బార్ రోడ్ (డివిజన్ 25) లో GSB, WMM రోడ్లను నిర్మించేందుకు రూ. 60 లక్షలు వెచ్చించనుండగా, కావేరి నగర్ 1వ మరియు 2వ లైన్లలో సీసీ డ్రెయిన్లు, సీసీ రోడ్లు, ఆర్‌సీసీ కల్వర్టులు ఏర్పాటు చేసేందుకు రూ. 60 లక్షలు కేటాయించారు. మొత్తంగా ప్రజల సౌకర్యార్థం మొత్తం రూ. 1 కోటి 66లక్షలు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి గారు మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వర్షాకాలంలో వచ్చే ఇబ్బందులు తొలగించాలన్న కృతనిశ్చయంతో ఈ డ్రైన్లు, కల్వర్టులు నిర్మాణాల పనులకు శంకుస్థాపన చేయటం జరిగింది. ప్రధాన రోడ్ల నుండి శివారు ప్రాంతాల వరకు సమానంగా మౌలిక వసతులు కల్పించడం మా కర్తవ్యంగా భావిస్తున్నాం. కార్పొరేషన్ ఆర్థికంగా బలంగా ఉండటం, ప్రభుత్వం నుండి తక్షణ అనుమతులు రావడం వల్ల అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయి. భవిష్యత్తులో పీపీపీ మోడల్‌లో భవన నిర్మాణాలు, మౌలిక వసతుల విస్తరణ చేపట్టేందుకు కూడా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నిజాయితీతో ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ కోవెలమూడి రవీంద్ర, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, డివిజన్ అధ్యక్షుడు గాలం వెంకటేశ్వర్లు, కదిరి సంజయ్, చెంబేటి మణికుమారి తదితరులు పాల్గొన్నారు.

## నేడు పద్మ విభూషణ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదినోత్సవ వేడుకలు

- **చినకాకానిలో మెగా రక్తదాన శిబిరం**
- **యర్రబాలెం అమ్మ ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం**
- **రాష్ట్ర చిరంజీవి యువత ఉపాధ్యక్షులు కంకణాల శంకర్**



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** పద్మ విభూషణ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదినోత్సవ వేడుకలు ఈనెల 22వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర చిరంజీవి యువత ఉపాధ్యక్షులు కంకణాల శంకర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. పద్మ విభూషణ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా ఈనెల 22వ తేదీ శుక్రవారం ఉదయం 10గంటలకు మంగళగిరి –తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి చినకాకాని లిటిల్ విలేజ్ లో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా తలసేమియా బాధిత చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ మెగా రక్తదాన శిబిరాన్ని నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, లిటిల్ విలేజ్ ఫౌండేషన్ చైర్మన్ కన్నెగంటి వెంకటేశ్వరరావు, అమ్మిశెట్టి వాసు, మండలి రాజేష్ తదితరుల చేతుల మీదుగా ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. రక్తం ఇవ్వదలచిన దాతలు సెల్:90321 13388లలో సంప్రదించాలని కోరారు. అదేరోజు మధ్యాహ్నం 12 గంటలకు యర్రబాలెం అమ్మ ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, మిఠాయిల పంపిణీతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆయా కార్యక్రమాలకు మెగా అభిమానులు, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మెగాస్టార్ చిరంజీవి జన్మదినోత్సవ వేడుకలు జయప్రదం చేయాలని కంకణాల శంకర్ కోరారు.

## అంగన్ వాడీల వేతనాలు పెంచాలి

- **రేషన్ కార్డులలో మార్పులు చేయాలి**
- **సి ఐ టి యు అనుబంధ జిల్లా అధ్యక్షురాలు కెవి. కుమారి**

**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయించి అంగన్ వాడీల వేతనాలు పెంచాలని, ఆన్లైన్ వర్క్ లు చేయుటకు ట్యాబ్ లు ఇవ్వాలని సిఐటియూ అనుబంధ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కెవి. కుమారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడీల నిరసన కార్యక్రమాలు అన్నిజిల్లా,మండల,ప్రాజెక్ట్ కార్యాలయాల్లో గురువారం నిర్వహిస్తున్న క్రమంలో, తెనాలిలోని సిడిపిఒ కార్యాలయంలో, అంగన్ వాడీ హక్కుల, కోర్కెల సాధన కోసం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కెవి. కుమారి మీడియాతొ మాట్లాడుతు ప్రభుత్వం రాష్ట్ర నాయకులతో చర్చలు జరపాలని ఆన్ లైన్ వర్క్ కి ఫోన్ల కు బదులు, ట్యాబ్ లు ఇవ్వాలన్నారు. ఎన్నికల ముందు వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామి మేరకు ఈ నెల నుంచైనా జీతాలు పెంచాలనేది తమ ప్రధానమైన డిమాండ్ గా తెలిపారు. మట్టి ఖర్చుల జీవో ని మార్చాలని అన్నారు. అంగన్ వాడీల రేషన్ కార్డులలో మార్పులు చేర్పులు చెయ్యాలన్నారు. సిఐటియు నాయకులు షేక్ హుసేన్ వలి మాట్లాడుతు గతంలొ వేతనాల పెంపు కోరుతు



అంగన్ వాడీ మహిళలు సమ్మె చేసినప్పుడు కూటమి నాయకులు అనేక హామీలు అమలు చేస్తామని, నమ్మకం కల్పించారని అన్నారు. ఇప్పటికైన అంగన్ వాడీలకు ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతొ కూడిన వినతి పత్రాన్ని సిడిపిఒ విజయ గౌరీ కి అందజేశారు. ఈకార్యక్రమంలొ పలువురు అంగన్ వాడి మహిళలు పాల్గొన్నారు.

## శ్రీ చెన్నకేశవ ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం

- **ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చేతుల మీదుగా భూమిపూజ**
- **84 లక్షల నిధులతో చెన్నకేశవ స్వామి ఆలయ నిర్మాణం ప్రారంభం**



**బ్రహ్మంగారిమఠం ,(జర్నలిస్ట్ ఫైల్) :** బ్రహ్మంగారిమఠం మండల పరిధిలోని దిరసవంచ పంచాయతీలో సగిలేరు ఒడ్డున ఉన్న శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయం గడచిన 400 ఏళ్ల క్రితం నిర్మించబడినప్పటికీ శిధిలావస్థకు చేరడంతో పంచాయతీ నాయకులు వేల్పుల భాస్కర్ యాదవ్ కత్తెరపల్లి కేశవరెడ్డి చెన్నారెడ్డిలు సమస్యను మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే ఆలయ అభివృద్ధి కోసం ?84 లక్షల నిధులు కేటాయించారు. ఈ నేపథ్యంలో గురువారం ఎమ్మెల్యే చేతుల మీదుగా శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని పునర్నిర్మించడం ఎంతో ఆనందంగా ఉంది. ఆలయానికి వచ్చే రహదారి సౌకర్యవంతంగా లేకపోవడంతో ఆలయం పూర్తయ్యేలోగా రహదారిని సీసీ రోడ్డుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామస్తులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అభివృద్ధి పనులు ప్రారంభం కావడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి నాయకులు కానాల మల్లికార్జున రెడ్డి ఎస్ఆర్ శ్రీనివాసుల రెడ్డి పోలి రెడ్డి వేల్పుల భాస్కర్ చెన్నారెడ్డి కత్తెరపల్లి కేశవరెడ్డి చెన్నారెడ్డి ఓబుల్ రెడ్డి వేల్పుల సుదర్శన్ వేల్పుల శ్రీకాంత్ పాణ్యం రామాంజనేయులు పాణ్యం బుజ్జయ్య తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మరియు టిడిపి నాయకులకు శాలువలతో ఘన సన్మానం చేశారు.

## నియోజకవర్గ స్థాయి రెవెన్యూ సమీక్ష సమావేశం

**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్):** ప్రత్తిపాడు నియోజకవర్గం లోని ఐదు మండలాలు మరియు కార్పొరేషన్ పరిధిలోని మండల రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, విలేజ్ రెవెన్యూ అధికారులు, రెవెన్యూ సిబ్బందితో ప్రత్తిపాడు నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యల గురించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రెవెన్యూ వ్యవస్థల మీద ప్రక్షాళన దిశగా చేస్తున్న ప్రయత్నం మీద రైతాంగం మరియు ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వాటికి పరిష్కార దిశగా ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు డా. బూర్ల రామాంజనేయులు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రెవెన్యూ సమీక్ష సమావేశం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు హాజరయ్యారు ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో రైతాంగం మరియు ప్రజలు అధికారుల అవగాహన లోపం, మరియు అలసత్వంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందుకు మొదటిసారిగా నియోజకవర్గ రెవెన్యూ అధికారులతో సమావేశం ఏర్పాటు



చేయడం జరిగిందని గతంలో మాజీ కలెక్టర్ గా పనిచేసిన అనుభవంతో ఏమైనా సమస్యలు ఉంటే దృష్టికి తేవాలని వాటిని తద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు., అదేవిధంగా అధికారులు సానుకూలంగా స్పందించాలని ఏమైనా సమస్య ఉత్పన్నమైనప్పుడు మండల రెవెన్యూ అధికారులు దృష్టికి, రెవెన్యూ డివిజన్ అధికారి దృష్టికి, పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని సూచించారు. సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లి వారికి సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని, అవగాహన లోపంతో సమస్యలు సృష్టించవద్దని దానికి రైతాంగం మరియు ప్రజలు ఇబ్బందులు పడ్డారని ఆ ఇబ్బందులు పునరావృతం కాకుండా చూడాలని తద్వారా ప్రభుత్వానికి మంచి పరిపాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు.

రాబోయే రోజుల్లో ఎవరైనా అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ అయిదు మండలాల తహసిల్దార్ లు,వి ఆర్ ఓ లు,సర్వేయర్ లు ఇతర రెవెన్యూ సిబ్బంది మరియు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

## బీసీల ఆత్మగౌరవమే లక్ష్యం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** బీసీలు ఆత్మగౌరవంతో జీవించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ శాఖ మంత్రి ఎస్. సవిత అన్నారు. దొమ్మర కులానికి గిరి బలిజ పేరు కలుపుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ప్రతినిధులు మంత్రి సవితను కలసి ధన్యవాదాలు తెలిపారు. వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి ఎన్నడూ లేనివిధంగా నిధులు కేటాయిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. త్వరలో ఆదరణ 3.0 పథకం ప్రారంభించి ఆధునిక పరికరాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఉత్తర్వులతో తమపై ఉండే అవమానానికి ముగింపు లభించిందని దొమ్మర కుల సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## వినాయక చవితి మండపాల ఏర్పాటుకు పక్కగా అనుమతులు ఉండాలి

- **డిఎస్‌పి జనార్ధన్ రావు**



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్):** వినాయక చవితి పండుగ సందర్భంగా మండపాలు ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించాలనుకునే వారు, ఐదుగురు, అంతకుమించి కమిటీగా ఏర్పడి, వారి పూర్తి వివరాలు,వారి సమీప పోలీస్ స్టేషన్ లొ తెలియజేయాలని, ఆన్ లైన్ ద్వారా, సింగిల్ విండొ విధానంలొ,అనుమతులు పొందాలని డిఎస్పి బి జనార్ధన రావు పేర్కొన్నారు. వినాయక చవితి పర్వదిన సందర్భంగా ఉత్సవాలు నిర్వహించే వారికి డి. ఎస్. పి. బి జనార్ధనరావు, గురువారం తమ కార్యాలయంలొ ఏర్పాటు చేసిన మీడియా సమవేశంలొ పలు సూచనలు చేశారు. విద్యుత్ శాఖ, అగ్నిమాపకశాఖ లనుండి విధిగా అనుమతులు తీసుకోవాలని, వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే మంటపంలో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆన్ లైన్ విధానం ద్వారా అనుమతిని పొందె కార్యాచరణను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు వినాయక చవితి పందిళ్ళలో, ఆధ్యాత్మిక పూజలు సాంస్కృతిక కార్యక్రమాలు, మినహా ఏఇతర అసాంఘిక కార్యకలాపాలకు, పాల్పడినా, కఠిన చర్యలు ఉంటాయన్నారు. రాత్రి వేళ మండపం వద్ద, వాలంటీర్ బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. గత సంవత్సరం వినాయక చవితి నిమజ్జన సమయంలో కేసులు నమోదైన వారిని, మండల తహాశీల్దార్ ఎదుట హాజరు పరచడం జరుగుతుందన్నారు. డిజె సౌండ్స్ పరిమితమైన సౌండ్ తొ,సమయ పాలనతొ, ఉపయోగించాలన్నారు. నిబంధనలు అతిక్రమించ కుండా,వినాయక చవితి పండుగను జరుపుకోవాలని పట్టణ ప్రజలకు ముందస్తుగా వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

## అంతర్ జిల్లా బదిలీలకు అందరికీ అవకాశం కల్పించాలి

- **తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయుల అంతర్ జిల్లా బదిలీలకు షెడ్యూల్ విడుదల చేసిన ప్రభుత్వ నిర్ణయం సంతోషకరమని, అయితే ఇది ఎక్కువ మందికి ప్రయోజనం కలిగేలా మార్గదర్శకాల్లో మార్పులు చేయాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. కేవలం భార్యాభర్తలు, పరస్పర బదిలీలు (మ్యూచువల్) మాత్రమే కాకుండా అవసరం ఉన్న అన్ని ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలన్నారు. ఇటీవల ఇచ్చిన ప్రమోషన్లలో రెండేళ్లు పూర్తి కాని వారికి క్యాడర్ సీనియారిటీని జీరోగా పరిగణించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మున్సిపల్ టీచర్లకు కార్పొరేషన్‌లో జీవిస్తున్న జీవిత భాగస్వామి (స్పౌజ్) వద్దకు బదిలీ అయ్యే అవకాశం కల్పించాలన్నారు. 2018లో ఇచ్చినట్లుగానే ఇంటర్ మేనేజ్మెంట్ ట్రాన్స్ఫర్ సౌకర్యం మున్సిపల్ టీచర్లకు ఇవ్వాలని టీఎన్యూఎస్ నాయకులు ప్రభుత్వాన్ని అభ్యర్థించారు.

## సమాజ సేవ అభినందనీయం



- **ఐ టీడీపీ నేత సతీష్ బాబు జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే నసీర్**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** సమాజ సేవకు తెలుగుదేశం పార్టీ కేడర్ ముందుకు రావడం సంతోషంగా ఉందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఐ టీడీపీ నేత గాలి సతీష్ బాబు జన్మదినోత్సవం సందర్భంగా గురువారం నగరంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ సమాజ సేవకు ముందుంటారని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు విజనరీతో పీ ఫోర్ కార్యక్రమం ద్వారా సమాజ సేవకు శ్రీకారం చుట్టారని తెలిపారు. పేదలకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం వైద్య శిబిరంలో సుమారు 200 మందికి వైద్యం అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు తూర్పు నియోజకవర్గం పరిశీలికులు గంజం రాఘవేంద్ర, యువ నాయకులు మన్నెం నాగమల్లేశ్వర రావు, జాగర్లమూడి శ్రీనివాసరావు, కార్పొరేటర్స్ మీరావాలి, యాల్లావుల అశోక్, డివిజన్ అధ్యక్షులు రియాజ్, జమీర్, కిరణ్, సత్యనారాయణ, రియాసత్, గొల్ల ప్రభాకర్, కోటా పిచ్చిరెడ్డి, మల్లెంపుడి శ్రీనివాస్, చల్లా ఆంజనేయ ప్రసాద్, వంగర ఏడుకొండలు, గోల్డ్ రఫీ, బత్తిని శంకర్, అస్గర్, బాజీ, ఆరిఫ్, బ్రహ్మం, ఆదినారాయణ, గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## మైనారిటీ దివ్యాంగ విద్యార్థికి చేయూత



○ ఉన్నత విద్యాభ్యాసం కోసం వక్ఫ్ బోర్డు ద్వారా లాప్ టాప్ అందజేసిన మంత్రి ఫరూక్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** పాఠశాలకు వెళ్లి తరగతిగదిలో కూర్చుని, ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను విని ఉన్నత విద్యావంతునిగా ఎదగాలన్న ఆశ ఉన్నప్పటికీ.. అంగ వైకల్యం కారణంగా పాఠశాలకు వెళ్లలేని పరిస్థితితో ఉన్న ఓ ముస్లిం మైనారిటీ దివ్యాంగ విద్యార్థికి రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ బాసటగా నిలిచి చేయూతను అందించారు. అంగవైకల్యం ఉన్నా ఉన్నత చదువులు చదువుకోవాలన్న తపన కలిగిన నెల్లూరుకు చెందిన షేక్ మొహమ్మద్ సుహైల్ కు డెల్ ల్యాప్‌టాప్‌ను గురువారం వెలగపూడి సచివాలయంలోని తన పేషీ కార్యాలయంలో మంత్రి ఫరూక్ అందించారు. షేక్ సుహైల్ పదో తరగతి పాస్ కావడం జరిగింది. శారీరకంగా రెగ్యులర్ స్కూల్‌కు వెళ్లే స్థితిలో లేనందున ఆన్‌లైన్‌లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకున్న సుహైల్ కు వక్ఫ్ బోర్డు ద్వారా ల్యాప్‌టాప్ ను మంత్రి ఫరూక్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఆత్మస్థైర్యంతో, చదువు పట్ల ఉన్న ఆసక్తి, తపనతో సుహైల్ ముందుకు సాగుతుండడం దివ్యాంగ విద్యార్థులందరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారని అభినందించారు. వక్ఫ్ బోర్డు ద్వారా అందించిన లాప్ టాప్ ద్వారా ఉన్నత చదువులను ఇంట్లో నుంచే ఆన్ లైన్ ద్వారా అభ్యసించడానికి వీలవుతుందని అన్నారు. భవిష్యత్తులో కూడా సుహైల్ కు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించడానికి మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా చేయూతను అందిస్తామని మంత్రి ఫరూక్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, వక్ఫ్ బోర్డు సభ్యురాలు డాక్టర్ ఆఫియా, సీఈఓ మహమ్మద్ అలీ, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండి యాకుబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## "రండి... టీ తాగుతూ మాట్లాడుకుందాం"



○ ఉద్యోగులు, ఉపాధ్యాయ-పెన్షనర్ల పెండింగ్ బకాయిలపై వినూత్న కార్యక్రమం

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల ఐక్యవేదిక వినూత్న కార్యక్రమం చేపట్టింది. "రండి... టీ తాగుతూ మాట్లాడుకుందాం" పేరుతో ప్రతి కార్యాలయంలో ఉద్యోగులు బకాయిల అంశంపై చర్చించేలా ఐక్యవేదిక పిలుపునిచ్చింది. మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ఐక్యవేదిక చైర్మన్ కెఆర్ సూర్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ కుమార్, గుంటూరు జిల్లా అధ్యక్షుడు చాంద్ బాష, మంగళగిరి తాలూకా యూనిట్ అధ్యక్షుడు మురళి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## కోనసీమలో సిఐటియు మధ్యాహ్న భోజన పథకం కార్మికుల జిల్లా సమావేశం

**అమలాపురం (జర్నలిస్ట్ ఫైల్):** అంబేద్కర్ కోనసీమ జిల్లా మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) జిల్లా విస్తృత స్థాయి సమావేశం గురువారం అమలాపురంలో జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి హాజరై, యూనియన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కార్మికులను పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా 23 మందితో కూడిన నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షురాలిగా కృష్ణవేణి, అధ్యక్షురాలిగా బేబి సరోజ, ప్రధాన కార్యదర్శిగా నాగ వరలక్ష్మి, కోశాధికారిగా వెంకటలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. అలాగే ఉపాధ్యక్షులుగా దుర్గ, కరుణ, కార్యదర్శులుగా లోవ లక్ష్మి, కె. చిట్టిబాబు, విజయలక్ష్మి, జల్లి సత్యనారాయణ, మంగతాయారు లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ ప్రకటనలో, సిఐటియు పేరుతో విచ్ఛిన్న చర్యలకు పాల్పడుతున్న కొంతమందికి సిఐటియు తో సంబంధం లేదని స్పష్టం చేశారు. ఆగస్టు 1న ఎన్నుకోబడిన ఈ కమిటీయే అసలు సిఐటియు అనుబంధ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ అని రాష్ట్ర కమిటీ ప్రకటించింది.

## సచివాలయ ఉద్యోగులపై ఔట్సోర్సింగ్ పెత్తనమా?



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ పర్యవేక్షణ కోసం మండలం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో మూడు అంచెల విధానం తీసుకొస్తూ 1785 మందిని డిప్యూటేషన్/ఔట్సోర్సింగ్ పద్ధతిలో నియమించాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం అనాలోచితమని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. గత ఆరు సంవత్సరాలుగా సేవలందిస్తున్న సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వాలనే ఆలోచన లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగుల పర్యవేక్షణకు ఔట్సోర్సింగ్ ఉద్యోగులను ఎలా నియమిస్తారని ప్రశ్నించారు.

అర్హులైన సచివాలయ ఉద్యోగులకే పదోన్నతులు కల్పించి మండల, జిల్లా స్థాయి ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా 1785 మందిని నియమించడం ప్రభుత్వానికి అదనపు ఆర్థిక భారమేనని, ఆ ఖాళీలను ప్రస్తుత సిబ్బందికే పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తే మేలు జరుగుతుందని రజాక్ తెలిపారు.

## జిఎంసి కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పని చేసే ప్రజారోగ్య, ఇంజినీరింగ్ విభాగాల కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు, తెలిపారు. ఈ నెల 22న (శుక్రవారం) మధ్యాహ్నం 3 గంటల నుండి 4 గంటల వరకు జరిగే ఈ గ్రీవెన్స్‌లో కార్మికులు పీఎఫ్, ఈఎస్ఐ, రుణాలు, ఆప్కాస్ వంటి అంశాలపై, ఉద్యోగులు తమ సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు.

# క్రీడల ద్వారా స్నేహభావం, శాంతి, ఐక్యత పెంపొందుతాయి : మంత్రి రాంప్రసాద్ రెడ్డి






○ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్ ప్రారంభించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

○ ఘనంగా ప్రారంభమైన ఎస్ఆర్ఆర్ఇంటర్నేషనల్ ఓపెన్ & బ్లిట్జ్ ఎఫ్ఐడీఈ రేటింగ్ చెస్ టోర్నమెంట్ - 2025

**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్):** విజయవాడలోని సిద్దార్థ కళాశాల లో ఘనంగా ప్రారంభమైన ఎస్ఆర్ఆర్ ఇంటర్నేషనల్ ఓపెన్ & బ్లిట్జ్ ఎఫ్ఐడీఈ రేటింగ్ చెస్ టోర్నమెంట్–2025లో రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...చెస్ ఆట మేధస్సును పెంపొందించే క్రీడ అని, ఇలాంటి అంతర్జాతీయ స్థాయి టోర్నమెంట్‌లు యువ క్రీడాకారులకు విశ్వవ్యాప్త అవకాశాలు కల్పిస్తాయని అన్నారు. అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులతో పోటీ పడే అవకాశాన్ని అందుకోవడం రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు.

టోర్నమెంట్‌లో దేశం నలుమూలల నుండి మాత్రమే కాకుండా విదేశాల నుండి కూడా పలువురు ప్రతిభావంతులు పాల్గొంటుండటం విశేషమని మంత్రి తెలిపారు. క్రీడల ద్వారా స్నేహభావం, శాంతి, ఐక్యత పెంపొందుతాయని కూడా ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, చెస్ ఆటగాళ్లు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**వైసీపీ నుండి టిడిపి లోకి భారీ చేరికలు**

విజయవాడ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారి సమక్షంలో వైసీపీ నుండి పలువురు కీలక నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు వారికి టీడీపీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

వైసీపీ వైఫల్య పాలనతో విసిగిపోయిన ప్రజలు, నాయకులు ఇప్పుడు రాష్ట్ర భవిష్యత్తుకు హామీ ఇచ్చే పార్టీగా తెలుగుదేశం పార్టీనే విశ్వసిస్తున్నారని మంత్రి గారు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు చేపట్టిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లో విశ్వాసం, నమ్మకాన్ని పెంచాయని తెలిపారు. ఇలాంటి చేరికలు రాబోయే రోజుల్లో మరింత పెరుగుతాయని, టీడీపీ బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

రాయచోటి నియోజకవర్గ ప్రజల పట్ల ఎల్లప్పుడూ అండగా నిలిచి, వారి సమస్యలను తనవిగా భావించి పరిష్కరించేందుకు కృషి చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారి త్యాగం, కృషి పట్ల గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంపై విశ్వాసంతో ఈ రోజు పలువురు నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు.

**టీడీపీ లో చేరిన ప్రముఖులు :** – పోలిరెడ్డి సుబ్బారెడ్డి (Ex Y-CP రాష్ట్ర కార్యదర్శి, Ex DCCB డైరెక్టర్ – లక్కిరెడ్డిపల్లి), తిమ్మిరెడ్డి ఉమాపతి రెడ్డి (Exఎంపీపీ – లక్కిరెడ్డిపల్లి), ఎస్. అజమతుల్లా (Exకోఆప్షన్ మెంబర్), బడుగు వాసుదేవుడు (బి సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు), రెడ్డన్నగారి రాజేందర్ రెడ్డి (Ex MPTC – పందిళ్ళపల్లి), ఎం. విజయ భాస్కర్ (Ex HDS – లక్కిరెడ్డిపల్లి), షేక్ మహమ్మద్ రఫీ (Ex HDS – లక్కిరెడ్డిపల్లి), పటాన్ షాదుల్లా ఖాన్ (మైనారిటీ సీనియర్ నాయకులు), రేపన వెంకటేశు (బీసీ నాయకులు – లక్కిరెడ్డిపల్లి), కోడూరు శ్రీనివాస్ రెడ్డి, ఎస్. ఆంజనేయులు, నరసింహులు, రవి ఆచారి తదితర గ్రామ , మండల స్థాయి నాయకులు.

## శ్రీశైల శిఖరం, దోర్నాల అటవీశాఖ చెక్ పోస్ట దగ్గర అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు : శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

**శ్రీశైలం(జర్నలిస్ట్ ఫైల్):** శ్రీశైలం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఉన్న శ్రీశైల శిఖరం, ప్రకాశం జిల్లా దోర్నాల అటవీ చెక్ పోస్ట దగ్గర అటవీ సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి విలేకరుల సమావేశంలో మండిపడ్డారు. శ్రీశైల శిఖరం, దోర్నాల అటవీ చెక్ పోస్టు వద్ద రాత్రి 9గంటల తర్వాత వచ్చే వాహనదారుల నుంచి రూ. 2వేల వరకు తీసుకుంటున్నార అటవీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



మంగళవారం రాత్రి ఎమ్మెల్యే అయిన నా వాహనాన్నీ ఆపేశారని, వారి వాహనాన్ని నా వాహనం ముందుపెట్టి నన్ను అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఎంతవరకు సమంజసం? అని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అటవీ అధికారులు ప్రశ్నించారు. రాత్రి 9 తర్వాత వాహనాలపై నిషేధం ఉంటే ఘాట్రోడ్డులో అన్ని వాహనాలు ఎలా ఉన్నాయి? బ్రీత్ ఎనలైజర్లు పట్టుకుని భారీ ఎత్తున అపరాధ రుసుము అటవీ సిబ్బంది వసూలు చేస్తున్నారని, . శ్రీశైలం పరిసరాల్లోని అటవీభూముల్లో పలు ఆక్రమణలున్నాయనీ, అటవీశాఖ అధికారులకు అవి కనిపించట్లేదా అని, దీంతో పాటు అటవీప్రాంతం పేరు చెప్పి ప్రతి అభివృద్ధి పనికీ అడ్డం తగులుతున్నారని, సున్నిపెంట, శ్రీశైలం నియోజకవర్గంలో ఒక్క రోడ్డుకూ అనుమతులు ఇవ్వట్లేదని, .అందుకే వారి వాహనంలో వారిని తీసుకెళ్లి శ్రీశైలంలో నేను చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు చూపించానని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి వివరించారు. వారిని గట్టిన ప్రశ్నించిన విషయం వాస్తవమే. అధికారులను ప్రశ్నించాను గానీ వారు దళితులా? గిరిజ నులా? అన్న విషయం నాకెలా తెలుస్తుంది? కొందరు అటవీశాఖాధికారులు, వైసీపీ అనుకూల గిరిజన సంఘాలు వాస్తవాలు తెలుసుకోకుండా నాపై దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి విలేకరుల వివరించారు.

## ఆసియా కప్‌కు తన కుమారుడ్ని ఎంపిక చేయకపోవడంపై శ్రేయస్ అయ్యర్ తండ్రి ఆవేదన




○ ఆసియా కప్ 2025 జట్టు నుంచి శ్రేయస్ అయ్యర్‌కు మొండిచెయ్యి

○ సెలక్టర్ల నిర్ణయంపై తీవ్ర నిరాశ వ్యక్తం చేసిన తండ్రి సంతోష్

○ ఐపీఎల్, ఛాంపియన్స్ ట్రోఫీలో పరుగుల వరద పారించినా దక్కని చోటు

○ అయ్యర్‌కు అన్యాయం జరిగిందన్న మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్

○ అతను వేచిచూడాలని స్పష్టం చేసిన సెలక్టర్ అజిత్ అగర్కర్

**స్పోర్ట్స్ (జర్నలిస్ట్ ఫైల్) :** ఎల్‌లో కెప్టెన్‌గా జట్టును ఫైనల్ వరకు నడిపించి, ఛాంపియన్స్ ట్రోఫీలో పరుగుల వరద పారించినా భారత స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌కు నిరాశే ఎదురైంది. రాబోయే ఆసియా కప్ 2025 కోసం ప్రకటించిన జట్టులో అతనికి చోటు దక్కకపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నిర్ణయంపై శ్రేయస్ తండ్రి సంతోష్ అయ్యర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అద్భుత ఫామ్‌లో ఉన్నా తన కుమారుడిని పక్కనపెట్టడంపై ఆయన పలు ప్రశ్నలు లేవనెత్తారు.

సంతోష్ అయ్యర్ మాట్లాడుతూ, "భారత టీ20 జట్టులో చోటు సంపాదించడానికి శ్రేయస్ ఇంకా ఏం చేయాలో అర్థం కావడం లేదు. ప్రతీ ఏడాది ఐపీఎల్‌లో అద్భుతంగా ఆడుతున్నాడు. కెప్టెన్‌గా ఢిల్లీ, కోల్‌కతా, పంజాబ్ జట్లకు గొప్ప విజయాలు అందించాడు. 2024లో కేకేఆర్‌ను ఛాంపియన్‌గా నిలబెట్టి, ఈ ఏడాది పంజాబ్‌ను ఫైనల్స్‌కు తీసుకెళ్లాడు. మేమేమీ అతన్ని కెప్టెన్ చేయమని అడగడం లేదు, కనీసం జట్టులో స్థానం ఇవ్వండి చాలు," అని అన్నారు.

సెలక్టర్ల నిర్ణయంపై శ్రేయస్ ఎప్పుడూ బహిరంగంగా అసంతృప్తి చూపించడని ఆయన తెలిపారు. "అతను ఎవరినీ నిందించడు. ఎంపిక కానప్పుడు, 'నా అదృష్టం ఇలా ఉంది (మేరా నసీబ్ హై), ఇప్పుడు ఏమీ చేయలేం' అని మాత్రమే అంటాడు. పైకి ప్రశాంతంగా ఉన్నా, మనసులో మాత్రం కచ్చితంగా బాధపడతాడు" అని సంతోష్ అయ్యర్ ఆవేదన చెందారు.

మరోవైపు, మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ కూడా ఈ నిర్ణయాన్ని తప్పుబట్టారు. "శ్రేయస్ అయ్యర్‌కు న్యాయం జరగలేదు. ఐపీఎల్ 2025లో పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా అద్భుతంగా రాణించాడు. కనీసం 15 మంది సభ్యుల జట్టులో, రిజర్వ్ జాబితాలో కూడా అతని పేరు లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది" అని తన యూట్యూబ్ ఛానెల్‌లో పేర్కొన్నారు. శ్రేయస్ ఈ ఏడాది ఐపీఎల్‌లో 17 మ్యాచ్‌లలో 604 పరుగులు చేసి టోర్నీలో ఆరో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇటీవల ముగిసిన ఛాంపియన్స్ ట్రోఫీలోనూ భారత్ తరఫున అత్యధికంగా 243 పరుగులు సాధించాడు.

ఈ విమర్శలపై చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ స్పందిస్తూ, "మేం కేవలం 15 మందిని మాత్రమే ఎంపిక చేయగలం. ఇందులో ఎవరి తప్పు లేదు. శ్రేయస్ ప్రస్తుతం తన అవకాశం కోసం వేచి ఉండాలి" అని వివరణ ఇచ్చారు. సెప్టెంబర్ 9 నుంచి యూఏఈ వేదికగా ఆసియా కప్ ప్రారంభం కానుండగా, గ్రూప్ 'ఎ'లో భారత్, పాకిస్తాన్, ఒమన్, యూఏఈ జట్లు ఉన్నాయి.

## ఎమ్మెల్యే సమక్షంలో సోమిరెడ్డి పల్లె సహకార సంఘం చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్)** బ్రహ్మంగారి మఠం టౌన్ నందలి సహకార సొసైటీ కార్యాలయం నందు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(సోమిరెడ్డి పల్లె) చైర్మన్ గా యల్లటూరు సాంబ శివా రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ . ప్రమాణ స్వీకార మహోత్సవ సందర్భంగా సోమిరెడ్డి పల్లె నుండి బైకు ర్యాలీతో సభ వద్దకు వచ్చి మరియు నాలుగు రోడ్ల కూడలిలో మేళ తాళాలతో బాణ సంచాలతో రంగ రంగ వైభవంగా ప్రమాణ స్వీకార మహోత్సవం జరిగింది. అలాగే డైరెక్టర్లుగా సురేష్ కుమార్ మరియు వెంకటేశులు ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది



ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ సహకార సంఘం ధ్వారా రైతులకు ఉపయోగపడేలా ఎరువులు, మరియు అర్హులైన వారికి రుణాలు అందేజేసి రైతుల సంక్షేమానికి కృషి చెయ్యాలి అని తెలియజేసినారు. ప్రమాణస్వీకారం అనంతరం ఎమ్మెల్యే గజ మాలతో ఘనంగా సత్కరించిన చైర్మన్ సాంబశివరెడ్డి డిసిసి బ్యాంక్ మేనేజర్ నవీన్ కుమార్ సీఈఓ ఏ రామిరెడ్డి . ఈ కార్యక్రమంలో డిస్టిక్ కోపరేటివ్ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య సబ్ డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ సత్యానందం బ్రహ్మంగారిమఠం తాసిల్దార్ కార్తీక్ ఎంపీడీవో పోలీస్ సిబ్బంది టీడీపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి ఉపాధ్యక్షుడు శీలం నరసింహ గౌడ్ సీనియర్ నాయకులు ముడుమాల పోలిరెడ్డి ఎస్సార్ శ్రీనివాసరెడ్డి కానాల మల్లికార్జున రెడ్డి పూజా శివ యాదవ్ మేకల సుధాకర్ యాదవ్ లగసాని గంగరాజు మాజీ టిడిపి మండల అధ్యక్షుడు అంకిరెడ్డిపల్లి రామసుబ్బారెడ్డి మాజీ మండల అధ్యక్షుడు మాలేపాటి సుబ్బారావు తదితర నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

## రైతుల సమస్య ను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరిస్తాం

○ ఎమ్మెల్యే ఆనందబాబు

**వేమూరు,(జర్నలిస్ట్ ఫైల్)** అకాల భారీ వర్షాలతొ ఏర్పడిన వరద ముంపుతొ, కోతకు గురయ్యే పొలాలకు సంబందించిన రైతుల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి సమస్యను తీసుకువెళ్ళి పరిష్కరించే దిశగా కృషి చేస్తామని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు రైతులకు బరోసా కల్పించారు. నియోజకవర్గంలోని కృష్ణానది పరివాహక ప్రాంతమైన,కొల్లూరు మండలంలో వరద ముంపు కారణంగా, కోతకు గురైన, తిప్పలకట్ట ప్రాంత, పొలాలను ఎమ్మెల్యే ఆనందబాబు గురువారం ఆప్రాంత రైతులతొ కలిసి,క్షేత్రస్థాయిలొ పరిశీలించారు. రైతులనడిగి పంటనష్టం వివరాలు తెలుసుకున్నారు. వరద ముంపు కారణంగా ప్రతీసారి కోతకు గురయ్యే పొలాల రైతుల ఇబ్బందులను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్ళి, తగు పరిష్కారం లభించేలా కృషి చేస్తామని రైతులలొ ఒక్కింత ధైర్యాన్ని నింపారు. అనంతరం ఎమ్మెల్యే



ఆనందబాబు మీడియాతొ మాట్లాడుతు వరదల కారణంగా కృష్ణానదీ పరివాహక పొలాలు, కోతకు గురయ్యే క్రమంలొ, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈసమస్య పరిష్కారం కోసం, సంబందిత అధికారులతొ చర్చించి శాశ్వత పరిష్కారం కోసం, రానున్న వేసవిలొ కార్యాచరణకు ప్రతిపాదనలను సిద్దం చేస్తామన్నారు. పంట నష్టం తగ్గించె చర్యలు చేపడతామన్నారు. కోతకు గురైన పొలాల పరిశీలనలొ ఎమ్మెల్యే ఆనందబాబు వెంట కొల్లూరు నాగశ్రీధర్, మాజి ఎమ్ పి పి మైనేని మురళీకృష్ణ, ఆప్రాంత రైతులు ఉన్నారు.

## సినీ కార్మికుల సమ్మెకు శుభం కార్డు... వేతనాల పెంపునకు నిర్మాతల అంగీకారం

○ గత 18 రోజులుగా కొనసాగుతున్న సినీ కార్మికుల సమ్మెకు తెర

○ కార్మికుల వేతనాలు 22.5 శాతం పెంచేందుకు నిర్మాతల అంగీకారం

○ సీఎం రేవంత్ రెడ్డి చొరవతో ఫలించిన చర్చలు

○ రేపటి నుంచి యథావిధిగా సినిమా షూటింగులు

○ మూడేళ్లలో దశలవారీగా వేతనాల పెంపు ఒప్పందం

○ 30 శాతం పెంపు డిమాండ్ చేయగా, 22.5 శాతానికి ఇరువర్గాల అంగీకారం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** గత 18 రోజులుగా తెలుగు సినీ పరిశ్రమను స్తంభింపజేసిన కార్మికుల సమ్మెకు తెరపడింది. కార్మికుల వేతనాలను 22.5 శాతం పెంచేందుకు నిర్మాతలు అంగీకరించడంతో ఈ ప్రతిష్టంభన వీడింది. తెలంగాణ కార్మిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన చర్చలు సఫలం కావడంతో, శుక్రవారం నుంచి సినిమా షూటింగులు తిరిగి ప్రారంభం కానున్నాయి.

వేతనాల పెంపు కోసం సినీ కార్మికులు సమ్మెకు దిగడంతో టాలీవుడ్‌లో చిత్రీకరణలన్నీ నిలిచిపోయాయి. ఈ సమస్య పరిష్కారానికి సీఎం రేవంత్ రెడ్డి చేసిన సూచన మేరకు ఫిల్మ్ ఛాంబర్, ఎఫ్‌డీసీ, కార్మిక శాఖ రంగంలోకి దిగాయి. నిర్మాతలు, ఫిల్మ్ ఫెడరేషన్ నాయకుల మధ్య జరిగిన త్రైపాక్షిక చర్చలు ఫలించాయి. ఈ సందర్భంగా నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ, ఇరు పక్షాలు ఒకరి సమస్యలను ఒకరు అర్థం చేసుకున్నాయని, సమస్య పరిష్కారానికి కృషి చేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఒప్పందం వివరాలను కార్మిక శాఖ అదనపు కమిషనర్ గంగాధర్ వెల్లడించారు. కార్మికులు 30 శాతం వేతన పెంపు డిమాండ్ చేయగా, సుదీర్ఘ చర్చల తర్వాత 22.5 శాతం పెంపునకు ఇరువర్గాలు అంగీకరించాయని ఆయన వివరించారు. ఈ పెంపు మూడేళ్లలో దశలవారీగా అమలు కానుంది. రూ. 2 వేల లోపు వేతనం ఉన్నవారికి మొదటి ఏడాది 15 శాతం, రెండో ఏడాది 2. 5 శాతం, మూడో ఏడాది 5 శాతం చొప్పున పెంపు ఉంటుంది. అదేవిధంగా, రూ. 2 వేల నుంచి రూ. 5 వేల మధ్య వేతనం ఉన్నవారికి మొదటి ఏడాది 7. 5 శాతం, రెండో ఏడాది 5 శాతం, మూడో ఏడాది 5 శాతం చొప్పున వేతనాలు పెరగనున్నాయి. ఈ ఒప్పందాన్ని స్వాగతిస్తున్నామని, శుక్రవారం నుంచి కార్మికులందరూ విధులకు హాజరవుతారని ఫిల్మ్ ఫెడరేషన్ నాయకులు ప్రకటించారు. పరిశ్రమ అభివృద్ధికి ఈ నిర్ణయం దోహదపడుతుందని, ముఖ్యమంత్రికి వారు కూడా ధన్యవాదాలు తెలియజేశారు. తాజా ఒప్పందంతో టాలీవుడ్‌లో మళ్లీ సినిమా చిత్రీకరణలు ఊపందుకోనున్నాయి.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467